

పోడు హక్కు
పట్టాల పంపిణీకి సిద్ధం

- ఏళ్లనాటి పోడు సమస్యకు పరిష్కారం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,737 మందికే హక్కు
- సంగారెడ్డి జిల్లాలో 1,127 మందికి 1808.07 ఎకరాలు
- మెదక్‌లో 610 మందికి 406 ఎకరాలు
- మిగతా దరఖాస్తులను పరిశీలించాలి: గిరిజన సంఘాలు

నవతెలంగాణ-మెదక్ ప్రతినిధి

అటవీ భూముల్ని నమ్ముకుని జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర రైతులకు న్యాయం చేయాలని అనేక ఏళ్లుగా వారు పోరాడుతున్నారు. అటవీ భూముల్ని పంట పొలాలుగా మార్చుకుని బతుకుతున్న రైతులు తమ భూములకు హక్కు కల్పించాలని వేడుకున్నారు. ఫారెస్ట్‌లో అడుగుపెడితే అటవీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేయడం, కేసులు పెట్టే దౌర్జన్యం కొనసాగింది. 2005 అటవీ హక్కుల హట్టం ప్రకారం అప్పటి వరకు సాగులో ఉన్న అర్హులైన రైతులకు పట్టాలిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ వేసి మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామ సభలు, డివిజన్ స్థాయి కమిటీలు, జిల్లా స్థాయి కమిటీలు సాగుదారుల నుంచి దరఖాస్తుల్ని పరిశీలించాయి. ఫారెస్ట్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు దరఖాస్తులు, రైతుల ఆధార్‌కార్డులు, భూమి సాగు చేసుకుంటున్నట్లు ధ్రువీకరణపత్రాలపై విచారించారు. సాగు భూముల్ని ఫీల్డ్‌లోకెళ్లి పరిశీలించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలో అత్యధికంగా పోడు భూముల్ని సాగు చేసుకున్నారు.

హక్కు పత్రాలు సిద్ధం

పోడు భూములకు హక్కు పత్రాలిచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అనేక గ్రామాల్లో పోడు భూములున్నాయి. సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్, కల్హేరు, కోహీర్, నాగిల్‌గిద్ద, నారాయణఖేడ్, వట్‌పల్లి, ఝరాసంఘం, మొగుడంపల్లి, చౌటకూరు, సిర్గాపూర్, హత్నూర ప్రాంతాల్లో పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని రైతులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,936 మంది రైతులు 7,109 ఎకరాలకు హక్కు కల్పించాని రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,168 మంది గిరిజనులు ఉండగా 1,768 మంది గిరిజనేతరులున్నారు. గ్రామ సభల్లో దరఖాస్తుల్ని పరిశీలించారు. ఫారెస్ట్, రెవెన్యూ, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులతో కూడిన అధికారుల బృందం గ్రామ సభలు నిర్వహించారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో భూముల్ని పరిశీలించి అర్హులెవరనేది నిర్ధారించారు. డివిజనల్ స్థాయి కమిటీల అర్హులైన పోడుదారుల్ని గుర్తించి జిల్లా కమిటీకి ప్రతిపాదించారు. జిల్లా కమిటీలో దరఖాస్తులు, సమర్పించిన పత్రాలను పరిశీలించి జిల్లా వ్యాప్తంగా 1,127 మంది రైతులు 1808.07 ఎకరాల్ని సాగు చేసుకుంటున్నట్లుగా గుర్తించారు. వీరికి హక్కు పత్రాలు ఇచ్చేందుకు పత్రాలు సిద్ధం చేశారు. మెదక్ జిల్లాలో 16 మండలాల్లోని 84 గ్రామాల నుంచి పోడు రైతులు దరఖాస్తు చేశారు. 4,015 మంది రైతులు 6,872 ఎకరాలకు హక్కు కల్పించాలని దరఖాస్తు చేశారు. వీరిలో 1,061 మంది గిరిజనులు కాగా 2,954 మంది గిరిజనేతరులున్నారు. వీటిని కూడా మూడు దశల్లో పరిశీలించి జిల్లా వ్యాప్తంగా 610 మంది రైతు లు 524 ఎకరాల్ని సాగు చేసుకుంటు న్నట్లుగా గుర్తించి హక్కు పత్రాలిచ్చేందుకు అర్హులుగా నిర్ణయించారు.

జిల్లా	దరఖాస్తులు	సాగు విస్తీర్ణం	గిరిజనులు	గిరిజనేతరులు	ఎంపికైన రైతులు	విస్తీర్ణం
సంగారెడ్డి	3,936	7,109	2,158	1,768	1,127	1808.07
మెదక్	4,015	6,872	1,061	2,954	610	524

> దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్య ఇక తీరనుంది. పోడుదారులకు పట్టాలిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. 2005కు ముందు సాగుదారులుగా ఉన్న రైతుల్ని గుర్తించి పట్టాలిచ్చేందుకు మార్గదర్శకాలను జారీ చేసింది. అనేక రూపాల్లో వడపోసి అర్హులైన పోడు రైతుల్ని గుర్తించింది. వారందరికీ హక్కు కల్పిస్తూ జులై 3న పట్టాలిస్తారంటున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 1,737 మంది రైతులకు పట్టాలిచ్చేందుకు అధికారులు సిద్ధం చేశారు.

6,214 దరఖాస్తులు పక్కన

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కలిపి వచ్చిన దరఖాస్తుల్లో ఇంకా 6,214 దరఖాస్తుల్ని పక్కన పెట్టారు. రెండు జిల్లాల్లో కలిపి 7,951 దరఖాస్తులు స్వీకరించి వాటిల్లో 1,737 మాత్రమే అర్హులుగా గుర్తించారు. మిగతా 6,214 దరఖాస్తుల్ని పక్కన పడేశారు. అదే విధంగా రైతులు సాగు చేసుకుంటున్న 13,981 ఎకరాలకు హక్కు కల్పించాలని దరఖాస్తులు చేసుకోగా అందులో కేవలం 2332.07 ఎకరాలకు మాత్రమే హక్కు పత్రాలివ్వబోతున్నారు. ఇంకా 11648.93 ఎకరాల భూముల సంగతి పక్కన పెట్టారు. దీంతో 6,214 మంది రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తాము కూడా పోడు సాగు చేసుకుంటున్నప్పటికీ సరైన పత్రాల్లేవనే నెపంతో హక్కు కల్పించే జాబితాలో చేర్చలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లాలో టేక్మాల్, పాపన్నపేట, మెదక్‌తో పాటు 16 మండలాల్లోని రైతులు తమకూ హక్కు కల్పించాలని కోరుతున్నారు.



ప్రభుత్వం నిర్ణయం మేరకు హక్కు పత్రాల పంపిణీ

పోడు భూములకు హక్కు కల్పించేందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అర్హుల జాబితా తయారైంది. వారందరికీ ప్రభుత్వం చెప్పిన ప్రకారం హక్కు పత్రాల్ని అందజేస్తారు. పోడుదారులకు కూడా ఇతర రైతుల మాదిరి వివిధ పథకాల్లో అవకాశాలుంటాయి.


– పిరంగి, గిరిజనాభివృద్ధి అధికారి, సంగారెడ్డి

1

నవతెలంగాణ

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం 28 జూన్ 2023



పంచాయతీ భవనాలను 30లోగా పూర్తి చేయాలి

- హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి
- బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి
- మన ఊరు మనబడి పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో మంజూరైన అన్ని గ్రామపంచాయతీ భవనాల పనులను ఈ నెల 30 వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రామీణాభివృద్ధి, పంచాయితీ, విద్యా, వెనుకబడిన తరగతుల శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించి గ్రామపంచాయతీ భవన నిర్మాణాల పురోగతి, మన ఊరు మనబడి పనుల పురోగతి, హరిత హారం, బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన గ్రామ పంచాయితీ భవనాలన్నింటినీ గ్రౌండింగ్ చేసి, పనులు ఈనెల 30లోపు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ కింద మూడు కేటగిరీలలో 15 గ్రామ పంచాయతీలున్నాయని, ఆయా కేటగిరీలలో ఎలాంటి గ్యాప్స్ లేకుండా సంబంధిత అధికారులు, ప్రత్యేక అధికారులు చూసుకోవాలన్నారు. హరిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని, గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలలో ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యం మేరకు ప్రణాళికతో మొక్కలు నాటాలని సూచించారు. హరితహారంలో భాగంగా వైకుంఠధామాలు, డంపింగ్ యార్డ్స్, తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు, పల్లె ప్రకృతి వనాలకు బయో ఫెన్సింగ్ వేయాలని, రోడ్ సైడ్ ఎవెన్యూ ప్లాంటేషన్, విద్యాసంస్థల్లో నాటిన మొక్కలలో గల గ్యాప్స్ పూర్తి చేయాలని తెలిపారు. బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకం కింద జిల్లాలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాపర్‌గా పరిశీలించాలన్నారు. ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ విషయంలో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీకి సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, మహిళా సమాఖ్యల ద్వారా చేపట్టిన వైద్య శాఖ సబ్ సెంటర్ బిల్డింగ్స్ నిర్మాణాలపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. మన ఊరు మనబడి కింద చేపట్టిన పనులు 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలలో జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచినందుకు విద్యాశాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డిపిఓ సురేష్ మోహన్, బిసి సంక్షేమ అధికారి జగదీష్, డీఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బోగస్ ఓట్లు నమోదు కాకూడదు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఎలక్ట్రోలు ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ కోరారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో డీఆర్ఓ, ఆర్డీఓ, తహసీల్దార్లతో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నియమావళిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఓ, వీఎల్ఓ, బీఆర్ఓ, సూపర్వైజర్లు ఇంటింటి సర్వే చేసి బోగస్ ఓట్లను గుర్తించి, అవి నమోదు కాకుండా చూయాలని సూచించారు. 18 నుంచి 29 సంవత్సరాల వయసు కల్గిన వారిని గుర్తించడానికి యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలన్నారు. ఇంటర్, ప్రొపెసనల్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో కో-ఆర్డినేషన్ చేసుకుని ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసి ఓటర్ జాబితాలను క్రాస్ చెక్ చేయాలన్నారు. ఒక ప్రాంతంలో రెండు నుంచి ఐదు పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలని, మార్పులు, వివరాలను సేకరించుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్లు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఉండేలా చూడాలన్నారు. ఒక కుటుంబంలో ఉన్న ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు కల్గి ఉండాలన్నారు. పోస్టల్ శాఖతో సమన్వయం చేసుకుని ఈపీఐసీ కార్డులు సరైన చిరునామాకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాల్ సెంటర్‌ను ఏర్పాటు ఏసి ప్రతి ఓటరుకు ఫోన్ చేసి ఓటరు నమోదు వివరాలను అడిగి క్రాస్ చెక్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్ఓ నగేష్ ఉన్నారు.

మూడు గంటల పరీక్షను రెండు గంటలంటూ..

- సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గందరగోళం
- గంట ముందుగానే పరీక్ష హాల్ నుంచి బయటకెళ్లిన విద్యార్థులు
- ప్రిన్సిపాల్, లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-సదాశివపేట: డిగ్రీ విద్యార్థులకు మూడు గంటలున్న పరీక్షా సమయాన్ని.. రెండు గంటలు మాత్రమే అని చెప్పడంతో సమయానికి గంట ముందే విద్యార్థులు బయటికి వెళ్లారు. ఎంతోమంది విద్యార్థులు గందరగోళానికి గురైన సంఘటన సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ప్రస్తుతం జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షకు సంబంధించి సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెంటర్ ఏర్పాటు చేశారు. మంగళవారం జరిగిన పరీక్షకు పలు కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. అయితే పరీక్షకు మూడు గంటల సమయం ఉన్నప్పటికీ.. అక్కడి ఇన్విజిలేటర్ మాత్రం రెండు గంటలు మాత్రమే అని విద్యార్థులకు చెప్పారు. దీంతో కొంతమంది విద్యార్థులు గంట ముందే పరీక్ష హాలు నుంచి బయటికి వెళ్లిపోయారు. అయితే జరిగిన తప్పును గుర్తించిన సెంటర్ నిర్వాహకులు రెండు గంటల తర్వాత మరో అర్థగంట సమయం ఉన్నదని విద్యార్థులకు చెప్పారు. అప్పటికే కొందరు విద్యార్థులు వెళ్లిపోగా, మిగిలిన విద్యార్థుల్లో గందరగోళం ఏర్పడింది. ఏది ఏమైనా విద్యార్థుల భవిష్యత్ ఆధారపడిన ఇలాంటి పరీక్షలపై ఇంత నిర్లక్ష్యంగా ఉండడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



50 మార్కుల పేపర్‌కు రెండు గంటలే ఉండేది..

ఇటీవల జరిగిన 50 మార్కుల పేపర్‌కు రెండు గంటల సమయమే ఉండేది. మంగళవారం జరిగిన పరీక్ష కూడా 50 మార్కుల పేపరే కావడంతో.. సంబంధిత ఇన్విజిలేటర్లు రెండు గంటల సమయంగా పొరబడ్డారు. ఉన్నతాధికారులను సంప్రదించగా మూడు గంటలు తెలపడంతో.. పరీక్షను మూడు గంటలు నిర్వహించాం.

– పతాంజలి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ప్రిన్సిపాల్, లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి



విద్యార్థుల భవిష్యత్‌కు ఆధారమైన పరీక్షల పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉండడం సిగ్గు చేటు. మూడు గంటల సమయాన్ని రెండు గంటలే అని చెప్పడంతో చాలా మంది విద్యార్థులు బయటికి వెళ్లిపోయా రు. మళ్లీ ఇంకాస్త సమయం ఉన్నదని చెప్పడంతో.. ఉన్నవారిలోనూ భయాందోళన నెలకొంది. కనీసం అవగాహన లేకుండా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది వ్యవహరించారు. విద్యార్థులకు తగిన సూచనలు ఇవ్వాల్సింది పోయి.. వారి పరీక్ష సమయం కూడా తెలియకుండా ఉండడం వారి అవివేకానికి నిదర్శనం. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, సిబ్బందిని సస్పెండ్ చేయాలి.

– ప్రవీణ్ కుమార్, సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- జులై 6 నుంచి నిరవధిక సమ్మె
- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్‌నర్సయ్య

నవ తెలంగాణ కొండపాక

'గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచాలి. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి. ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలి. పంచాయతీ సిబ్బంది ఇతర సమస్యలు పరిష్కరించాలి' అని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్‌నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం స్థానిక సీఐటీయూ ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జె.ఎ.సి. ఆధ్వర్యంలో జూలై 6 నుండి జరిగే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలన్నారు. పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.జీఓ 60 ప్రకారం నిర్ణయించిన వేతనాలను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా జనరల్ సెక్రెటరీ బర్మ కొమురయ్య, కోకన్వీనర్ ప్రభాకర్, మండల అధ్యక్షులు ఆరుట్ల నర్సింలు, నాయకులు కొమ్ము నర్సింలు, తాటోజు మల్లేశం తలపాక లక్ష్మి కిన్నెరకల బుడిగి ఆంజనేయులు కనకవ్వ పుష్ప నర్సవ్వ లచ్చవ్వ రాజు నవీన్ లక్ష్మణ్ మల్లేశం చంద్రయ్య ఐలయ్య బిక్షపతి శ్రీనివాస్ కిష్టయ్య పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు మద్దతిస్తే బైండోవర్లు, కేసులు

- రియల్ వ్యాపారులతో కుమ్మక్కైన అధికారులు
- అక్రమ కేసులను ఎత్తి వేయాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం, జిల్లా కార్యదర్శి బి.బస్వరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం

నవతెలంగాణ - మెదక్

నిరాశ్రయులైన పేదలకు మద్దతిస్తే బైండోవర్లు, అక్రమ కేసులు పెడతారా? అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం, జిల్లా కార్యదర్శి బి. బస్వరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం ఆగ్రహించారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడారు. మెదక్ పట్టంలోని 248/1 సర్వే నంబర్‌లో నిరుపేదలు గుడిసెలు వేసుకున్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఈ విషయంలో గత 15 రోజుల క్రితం రియల్ ఎస్టేట్ వ్యాపారుల జోక్యంతో పేదలు వేసుకున్న గుడిసెలను తగలబెట్టారని తెలిపారు. దీంతో గుడిసెలు వేసుకున్న పేదలు అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పరిస్థితి లేదని ఆరోపించారు. ప్రస్తుతం 15 రోజుల తరువాత పేదలకు మద్దతు ఇచ్చిన నాయకులు మల్లేశం, నయీంలపై కేసులు పెట్టి, బైండోవర్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. సంఘటన జరిగినప్పుడు స్పందించని అధికారులు ఇన్ని రోజులకు ఎవరి ప్రోద్భలంతో కేసులు చేశారని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుపేదల గూడు విషయంలో సీఎం ప్రకటనలను కొందరు బేఖాతర్ చేస్తున్నట్లు తెలిపారు. పేదలు గుడిసెలు వేసుకొని ఆరు నెలలు అవుతున్నా తహసీల్దార్ పర్యవేక్షించిన పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రలోభాలకు లొంగకుండా పేదల పక్షాన ఉన్న నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.



సాగుకు సమాయత్తం



- పత్తి పంటపైనే రైతుల మొగ్గు
- తొలకరి చినుకులతో ప్రారంభమైన వ్యవసాయ పనులు
- ముమ్మరంగా సాగు పనుల్లో రైతులు
- పెట్టుబడి సాయం పెంచాలంటున్న రైతులు

నవతెలంగాణ- కొల్చారం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తోంది. ఆలస్యంగా వర్షం కురవడంతో పంటల సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. కోటి ఆశలతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతూ.. పొలాల్లో దుక్కులు దున్నుతున్నారు. ధరలకు అనుగుణంగా పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం పెంచాలని రైతులు వేడుకుంటున్నారు. ఇటీవల తొలకరి జల్లులు కురియడంతో అన్నదాతలు విత్తన సేకరణ, దుక్కి దున్నకం పనుల్లో నిమగ్నమయ్యారు. ఈసారి వర్షాలు దంచికొట్టే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. కొల్చారం మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 22,496 ఎకరాల్లో భూములున్నాయి. ఇందులో వ్యవసాయ భూమి 11,576 ఎకరాలు, సాగుకు వీలులేని భూమి 10,920 ఎకరాలు ఉంది. సన్న, చిన్న కారు రైతులు 11,057 మంది ఉన్నారు. గతేడాది వరి 18,975 ఎకరాలు, పత్తి 1,125 ఎకరాల మేరకు పంటలు సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది అధికంగానే సాగు విస్తీర్ణం మరో 300 ఎకరాలు పెరిగే అవకాశం ఉందని మండల వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు వానాకాలం ప్రణాళికలను వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. తొలకరి జల్లులు కురిసిన తరుణంలో వరి సాగు చేసే పొలాల్లో ఇప్పటికే రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట, జనుము, జీలుగ విత్తనాలు రాయితీపై తెచ్చి చల్లుతున్నారు. మండలానికి 1500 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ప్రస్తుతం యూరియా 150, డిఏపి 70, కాంప్లెక్స్ 250, మెట్రిక్ టన్నుల ఎరువులు వివిధ ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పెట్టుబడులకు అగచాట్లు

అన్నదాతకు సాగు కష్టాలు మొదలయ్యాయి. చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితిలో సీఎం కేసీఆర్ పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.5వేల చొప్పున రైతుల ఖాతాల్లో ఇటీవల జమ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడి సాయం సరిపోవకపోవడంతో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ధరలకు అనుగుణంగా సాయాన్ని పెంచితే బాగుంటుందని రైతులు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. బ్యాంకులు సైతం సాగు పెట్టుబడుల కోసం రుణాలు ఇవ్వకపోవడం పట్ల రైతులు నిరాశ చెందుతున్నారు. కొంతమంది రైతులు చివరికి చేసేదేమీ లేక ఇళ్లలో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇంకొందరు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వాన దేవుడు కరుణించకపోతాడా అన్న ఆశతో అప్పులు చేసి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బ్యాంకర్ల ద్వారా రుణాలు ఇప్పించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



ఎరువుల ధరలు తగ్గించాలి



కష్టపడి పంటలు పండిస్తే ఏమీ మిగులుతలేదు. ఎరువుల ధరలు తగ్గించాలి. రెండు రోజుల క్రితం పడిన వర్షానికి దుక్కులు దున్నుతున్నం. పెద్ద వానలు పడంగనే పంటలు పెడతాం. ఎరువుల కొరత లేకుండా చూడాలి.

– యాదగిరి, పైతర

పెట్టుబడి సాయం పెంచాలి



గత ఏడాది సాగు చేసిన అప్పులే తీర్చలేకపోయాం. పెట్టుబడి సాయం పెంచి, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలి. ఈ ఏడాది ఖరీఫ్ సాగు పెట్టుబడులకు అగచాట్లు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– కిషన్

ఇబ్బందులు లేకుండా చూస్తాం



వానాకాలం పంటలకు సంబంధించి ఎరువుల కొరత లేకుండా చూస్తాం. ఇప్పటికే రైతులకు ఆయా సహకార సంఘాల్లో, ఫర్టిలైజర్ దుకాణాల్లో కొంతమేరకు ఎరువులను సిద్ధంగా ఉంచాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వివిధ రకాల విత్తనాలు కూడా అందుబాటులో ఉంచాం.

– స్వేత కుమారి, మండల వ్యవసాయ అధికారి

రాజ్యసభ మాజీ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి మృతి



నవతెలంగాణ దుబ్బాక రూరల్

రాజ్యసభ మాజీ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి(88) స్వల్ప అస్వస్థతతో హైదరాబాదులో కన్నుమూశారు. సిద్దిపేట జిల్లా చిట్టాపూర్ గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి తొలితరం కమ్యూనిస్టు నాయకుల స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. సిటీ కాలేజీలో పట్టభద్రులైన రామచంద్రారెడ్డి అనంతరం రాజకీయాల్లో పూర్తి కాలం పని చేశారు. స్వగ్రామం చిట్టాపూర్ సర్పంచ్‌గా, దుబ్బాక సమితి అధ్యక్షుడిగా, సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, అప్పటి మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా, దొమ్మాట శాసనసభ్యునిగా సేవలందించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యునిగా, రాజ్యసభలో ఆ పార్టీ నాయకులుగా, రాజ్యసభ హామీల అమలు స్థాయి సంఘం అధ్యక్షులుగా, పలు హెూదాల్లో విశిష్ట సేవలు అందించారు. ఇటీవలి కాలంలోనూ భారత చైనా మిత్రమండలికి అధ్యక్షులుగా, సి.ఆర్.ఫౌండేషన్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు వంటి సంస్థలకు సభ్యులుగా సేవలందించారు. లోక్‌సత్తాలో కూడా కొంతకాలం పని చేశారు. 70 ఏళ్ల పాటు రాజకీయాలలో క్రియాశీలంగా పనిచేసి మచ్చలేని వ్యక్తిగా పేరుపొందారు. సోలిపేట రామచంద్రారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి చిన్న కుమార్తెను తమ పెద్ద కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డికి చేసుకున్నారు. ఆయన మృతదేహాన్ని బంజారాహిల్స్ శాసనసభ్యుల నివాసాల్లో 272ఏలో ఉంచారు.

సీపీఎం సంతాపం

నవతెలంగాణ-సంగారెడ్డి: రాజ్యసభ మాజీ సభ్యుడు సోలిపేట రామచంద్రారెడ్డి మంగళవారం హైదరాబాదులో మరణించడంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు సంతాపం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా చిట్టాపూర్ గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి తొలితరం కమ్యూనిస్టు నాయకుల స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, అప్పటి మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా, దొమ్మాట ఎమ్మెల్యేతో పాటు అనేక పదవుల్లో పని చేశారన్నారు. 70 ఏళ్ల పాటు రాజకీయాలలో క్రియాశీలంగా పనిచేసి మచ్చలేని వ్యక్తిగా పేరుపొందారని అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్: తొలితరం కమ్యూనిస్టు నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు సోలిపేట రామచంద్రారెడ్డి మృతికి సీపీఎం సిద్దిపేట జిల్లా కమిటీ సంతాపం తెలియజేసింది. మంగళవారం సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేస్తూ అనేక పదవులు అలంకరించిన సోలిపేట రామచంద్రారెడ్డి భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించారన్నారు. చిట్టాపూర్ గ్రామ సర్పంచ్‌గా మొదలుకొని రాజ్యసభ సభ్యుని వరకు అనేక పదవులు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన మృతికి సీపీఎం సిద్దిపేట జిల్లా కమిటీ సంతాపం తెలియజేస్తూ, ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

పదో తరగతి మెమోల కోసం విద్యార్థుల ఆందోళన



నవతెలంగాణ హవేలి ఘనాపూర్

హవేలిఘనాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఆందోళన నిర్వహించారు మంగళవారం మండలం కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు సమీక్ష, కావేరి, సింధు, జ్యోతి మెమోల కోసం ప్రిన్సిపాల్ రజిని సంప్రదించారు. వారి మెమోలు దొరకపోవడంతో నలుగురు విద్యార్థులు ఆందోళన గురయ్యారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ రజినిని సంప్రదించారు. ప్రిన్సిపాల్ రజిని మాట్లాడుతూ తల్లిదండ్రులు, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందొద్దని, వారికి న్యాయం చేస్తామన్నారు.

మంజీరలో తల్లీకూతుళ్ల అనుమానాస్పద మృతి



నవతెలంగాణ రాయికోడ్

మండల పరిధిలోని సిరూర్ గ్రామ శివారులోని మంజీర పరీవాహక ప్రాంతంలో విషాదం చోటు చేసుకుంది. మంజీరా నదిలో దూకి తల్లీ కూతుళ్ల ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను రాయికోడ్ మండలం చెర్ల నాగన్ పల్లి గ్రామానికి చెందిన విజయ (32) గౌరి (4) గా గుర్తు గుర్తించారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం రెండు మృతదేహాలు నదిలో కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాలను వెలికితీసిన పోలీసులు పోస్టుమార్టం కోసం జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విజయకు 10 సంవత్సరాల క్రితం మిర్జాపూర్ (బి) గ్రామానికి చెందిన నర్సింలుతో వివాహం జరిగింది. ఈమెకు 4 సంవత్సరాల పాప గౌరి పుట్టినప్పుడి నుండి చెర్లనాగన్‌పల్లి తల్లిగారి ఇంట్లో ఉంటోంది. తల్లీ బిడ్డల ఆత్మహత్య అనుమానాస్పదంగా ఉందని ఎస్ఐ బి.వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. మంగళవారం మిషన్ భగీరథ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం సుందరయ్య భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులు ఇంటింటికి నీటిని సరఫరా చేస్తున్నా కనీస వేతనాలు, చట్టపరమైన సౌకర్యాలు నేటికీ అమలు కావడం లేదన్నారు. మిషన్ భగీరథ గురించి రోజు గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణ చేస్తున్న మిషన్ భగీరథ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలకు దిక్కు లేదన్నారు. వెంటనే కనీస వేతనం రూ. 26 వేలు, చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని, లేనిపక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. జిల్లాలో వివిధ కాంట్రాక్టులు వారికి ఇష్టం వచ్చినట్టు వేతనాలు చెల్లిస్తున్నారని అన్నారు. జి కే ఆర్ సంస్థ ఈఎస్ఐ, పీఎఫ్ కూడా అమలు చేయడం లేదన్నారు. ఈఎస్ఐ పీఎఫ్ అమలు చేయని కాంట్రాక్టులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, రాములు, నాయకులు నర్సింలు, రాములు, వెంకటేష్, సిద్ధప్ప, కృష్ణ, ప్రభాకర్, సుదర్శన్, రవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి



నవతెలంగాణ- గజ్వేల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మూడోసారి అధికారం తీసుకురావాలని మహబూబ్నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి మోదీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకుపోయి వివరించాలన్నారు. గజ్వేల్ నుండి బిజెపి విజయసంకల్ప సభను పూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల బిజెపి అధ్యక్షులు దూది శ్రీకాంత్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ అంజన్ కుమార్ గౌడ్, బిజెపి రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వెంకటరమణ, బిజెపి మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామ్ మోహన్ గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు యెల్లు రాంరెడ్డి, నందన్ గౌడ్, గురువా రెడ్డి, కప్పర ప్రసాద్ రావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాలాగామ శ్రీనివాస్, పేర్ల శ్రీనివాస్, బిజెపి జిల్లా కార్యదర్శి కూడిక్యాల రాములు, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, కో - కన్వీనర్ సురేష్, మహేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మనోహర్ యాదవ్, పగల అజయ్, బిజెపి మండలాల అధ్యక్షులు మధుసూదన్, అశోక్ గౌడ్, రమేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, శశిధర్ రెడ్డి, శ్రీరామ్ శ్రీకాంత్, తోడుపునూరి రమేష్, మహేష్ యాదవ్, నరేంద్ర చారి పాల్గొన్నారు.

పురగిరి క్షత్రియ కుల సంఘం భవనానికి స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

పురగిరి క్షత్రియ కుల సంఘం భవనానికి స్థలం కేటాయించాలని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మెన్ చింతా ప్రభాకర్‌తో కలిసి క్షత్రియ కుల సంఘం నేతలు కలెక్టర్ డాక్టర్ శరత్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఎకరా స్థలం కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురగిరి క్షత్రియ జిల్లా అధ్యక్షులు హరికిషన్, జైపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన పూజ సబావతి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. అయితే వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి కింద రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన పత్రాలను టీఎస్‌హెచ్‌డిసి చైర్మెన్ చింతా ప్రభాకర్ తన నివాసంలో బాధితురాలి తండ్రికి మంగళవారం అందించారు. అనంతరం చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తున్నదన్నారు. కాగా ఈ సాయం అందడానికి కృషి చేసిన చింతా ప్రభాకర్‌కు పూజ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు , మం. ప్రధాన కార్యదర్శి అరిపోద్దిన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సుధీర్ రెడ్డి, యదా గౌడ్, సర్పంచులు, సిద్ధన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు సీఐగా లాల్ నాయక్

పదోన్నతిపై డిఎస్పీగా వెళ్లిన వేణుగోపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు డిటెక్టివ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లాల్ నాయక్ మంగళవారం పటాన్‌చెరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా పదవి బాధ్య తలు చేపట్టారు. ఇంతకు పూర్వం సర్కిల్ ఇన్‌స్పెక్ట ర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నూకల వేణుగోపాల్ రెడ్డి పదో న్నతిపై డీఎస్పీగా సంగారెడ్డి ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన సీఐ లాలూ నాయక్ మాట్లా డుత ూ.. ఫ్రెండ్లీ పోలీస్‌గా శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.



విద్యార్థులకు పలకలు పంపిణీ

నవతెలంగాణ-ఝరాసంగం

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలకలు, విద్య సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మెన్ మొరంగి పల్లి జైపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నయ్య చేతుల మీదుగా విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన విధంగా నడుచుకోవలన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ ఆర్ నర్సింలు సభ్యులు మోహన్ ఉపాధ్యాయులు తుక్కప్ప సంగీత, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.10 వేల సాయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో నివాసముంటున్న యూపీకి చెందిన సికిందర్ పక్షపాతంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో.. వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడు తున్న విషయం బొల్లారం బీజేపీ పార్టీ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డికి తెలిసి ంది. దీంతో కృష్ణారెడ్డి వెంటనే స్పందించి ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందు తున్న సికిందర్‌ను పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం పది వేల ఆర్థిక సాయం అందజేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



రైతులకు కంది విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని ముంగి రైతు వేదికలో కంది విత్తనాల మినీకిట్స్ బ్యాగులను మంగళవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల ఏఓ లావణ్య మాట్లాడుతూ.. జాతీయ ఆహార భద్రత పథకం కింద మండలానికి కందులు 14, మినుము 18, సోయా 8 క్వింటాళ్ల కొత్త వెరైటీ విత్తనాల మినికిట్స్ బ్యాగులు వచ్చి నట్టు తెలిపారు. అవసరం ఉన్న రైతులు ఆయా క్లస్టర్లలో గ్రామ ఏఈఓలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏఈఓ షరీఫ్, రైతులు ఉన్నారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి



నవతెలంగాణ-మునిపల్లి

వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో.. రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.కుమార్ అన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన సందర్భంగా ప్రభుత్వం ఇప్పటివరకు వ్యవసాయ ప్రణాళిక ప్రకటించలేదన్నారు. ఇప్పటికే పలుచోట్ల నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయని.. కాబట్టి నకిలీ విత్తనాలు లేకుండా నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేవిధంగా అధికారులు చూడాలన్నారు. రైతులకు ప్రభుత్వ బ్యాంకు రుణాలు ఇవ్వాలని, 58 ఏండ్లు నిండిన రైతులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులను ఆదుకోవాలని, ఒకేసారి లక్ష రూపాయల రుణ మాఫీ చేయాలని, రైతుబంధు డబ్బులు వెంటనే రైతు ఖాతాలో నేరుగా జమ చేయాలని, యాసంగి వడ్ల పంట డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



'డబుల్' ఇండ్ల కేటాయింపులో స్థానికులకు మొండి చేయి

నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు పారిశ్రామిక వాడకు వచ్చిన సీఎంకు వంగి వంగి దండాలు పెట్టినా.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో పటాన్‌చెరు ప్రాంత ప్రజలకు మొండి చేయినే చూపారని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆరోపించారు. రెండు సార్లు పటాన్‌చెరుకు వచ్చిన ముఖ్యమంత్రికి బీఆర్ఎస్ నాయకులు పటాన్‌చెరు నుంచి ఇస్నాపూర్ వరకు వొంగి వొంగి దండాలు పెట్టినా.. కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను పటాన్‌చెరు ప్రాంత ప్రజలకు ఇవ్వడానికి సీఎం కేసీఆర్‌కు మనసురా లేదన్నారు. వేరే ప్రాంతాల వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చి ఇక్కడివారిని అవమానించారని ఆరోపించారు. పేదలకు ఇండ్లు దక్కే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు కుంచాల కిషన్, యువరాజ్ నాయక్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర, బసవేశ్వరతో సంగారెడ్డి స్వస్యశ్యామలం

నవతెలంగాణ-సదాశివపేట

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులతో సంగారెడ్డి జిల్లా స్వస్యశ్యామలం అవుతుందని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మెన్ చింతా ప్రభాకర్ అన్నారు. మండలంలోని నందికంది గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో మంగ ళవారం చేపట్టిన రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులకు సబ్సిడీ ద్వారా మంజూరైన వంద క్వింటాళ్ల జనుములు విత్తనాలు అందజేసి మాట్లాడారు. సంగమేశ్వర, బసవేశ్వర ద్వారా 80 వేల ఎక రాలకు సాగు నీరు అందుతుం దన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలస్తున్న దన్నారు. రైతు పక్షపాతి అయిన సీఎం కేసీఆర్‌ను మూడో సారి అధికా



రంలోకి తీసుకురావాలన్నారు. అదేవిధంగా నందికంది గ్రామం అంటే తనకు చాలా అభిమానం అని.. ఈ గ్రామ ప్రజల మద్దతు తనకు ఎల్లవేళలా ఉండాలని కోరారు.

అక్షరాలతో లక్షల వ్యాపారం



- జోగిపేట కృష్ణవేణి పాఠశాలలో ఫీజుల దోపిడీ
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేటలోని కృష్ణవేణి పాఠశాలలో అక్షరాలతో లక్షల వ్యాపారం చేస్తున్నారని, ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా చేశారని.. వెంటనే సదరు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షు డు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ.. అందోల్ నియోజక వర్గంలోని జోగిపేటలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యజ మాన్యం జీవో నెంబర్ 1.91.46.ప్రకారం ఫీజులు తీసుకో కుండా ఇష్టానుసారం దండుకుంటున్నదని ఆరోపించారు. యూకేజీకి రూ.13 వేలు, రెండో తరగతి విద్యార్థికి రూ.13,500 వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై అడిగితే 'మా ఇష్టం ఉన్నంత వసూలు చేస్తాం' అని నిర్ల క్ష్యంగా మాట్లాడారన్నారు. కాబట్టి పాఠశాల యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. యజమాన్యం ఫీజులు పెంచాలనుకున్నప్పుడు.. పేరెంట్స్ కమిటీ ఆమోదా నికి పెట్టిన తర్వాతనే 10 శాతం ఫీజులు పెంచుకోవాల న్నా రు. జోగిపేటలో ఇలా అక్రమంగా ఫీజులు దండుకుం టు న్న పాఠశాలపై మండల అధికారులు చర్యలు చేపట్టాల న్నా రు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కృష్ణవేణి స్కూల్‌ని సీజ్ చేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. లేని యెడల జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రేణు కుమార్, మం డల ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కృష్ణ, మైపాల్, సతీష్, మహిపాల్, కె. మైపాల్ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం చైతన్య సభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 29, 30 తేదీల్లో జరగనున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్రస్థాయి చైతన్య సభలను జయప్రదం చేయా లని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ పిలుపుని చ్చారు. కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యద ర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కల్లుగీత పారిశ్రామిక ఆర్థిక సహకార కార్పొరేషన్‌కు ప్రభుత్వం బడ్జెట్లో కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేతివృత్తిదారులకు ఇస్తున్న లక్ష రూపాయల సబ్సిడీ రుణాల్లో రాష్ట్రంలో దరఖాస్తు చేసు కున్న కల్లుగీత వృత్తిదారులందరికీ ఇవ్వాలన్నారు. అరులైన గీతా కార్మికులకు బైకులు ఇవ్వడంతో పాటు గీత కార్మికులు డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ నేపథ్యం లో రాష్ట్ర ప్రభుత్వం గౌడ సోదరులకు చేస్తున్న సంక్షేమ పథకాలు, కల్లుగీత కార్మికులు, గౌడ సోదరులు ఎదుర్కొం టున్న సమస్యలు గురించి చర్చించడం కోసం, భవిష్యత్తులో గౌడ సోదరులు, కల్లుగీత కార్మికుల అభివృద్ధి కోసం తీసుకునే చర్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం కోసం జనగామ పట్టణంలో రేపు, ఎల్లుండి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్రస్థాయి చైతన్య సభలను నిర్వహిస్తున్నార న్నారు. ఈ సభలకు రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు మండల అధ్యక్ష కార్యదర్శులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో సంఘం ఉపాధ్యక్షులు జంగన్న గౌడ్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రాములు గౌడ్, నాగరాజు గౌడ్, కుమార్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, రవి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మైలాన్, హెటిటో డ్రగ్స్ పరిశ్రమల్లో కార్మిక హక్కుల ఉల్లంఘన



- సీఐటీయూ ఆధ్వర్యంలో డీసీఎల్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-సంగారెడ్డి

బొల్లారం, కాజిపల్లి, గడ్డపోతారం, బొంతపల్లిలలో ఉన్న మైలాన్, హెట్రో డ్రగ్స్ పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు కావడం లేదని సీఐటీ యూ ఆధ్వర్యంలో డిసీఎల్ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే. రాజయ్య మాట్లాడుతూ.. పేరుకే పెద్ద పరిశ్రమలు తప్పా.. కార్మికుల సౌకర్యాలు, చట్టాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. దేశవ్యాప్తంగా, అంతర్జా తీయంగా పేరుగాంచుతున్న పరిశ్రమలు.. కార్మికుల శ్రమ దోపిడీ చేసుకుని లాభాలు గడించడం తప్పా కార్మిక సంక్షేమాన్ని అమలు చేయట్లేదన్నారు. జీవో 117 ప్రకారం కెమికల్ మరియు ఫార్మసిటికల్ జీవో ప్రకారం రోజుకు రూ.444 అన్‌స్కిల్‌కు, ఆపరేటర్లకు రోజుకు రూ.487 చెల్లిం చాలన్నారు. నెలకు అన్‌స్కిల్‌కు రూ. 11,529, ఆపరేటర్లకు రూ. 12,657 చెల్లించాలని ఉన్నప్పటికీ.. అవి ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని జీవో ఉన్నప్పటికీ ఆ జీవోను అమలు చేయడం లేదన్నారు. అంతేకాకుండా కాంటాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్, క్యాంటీన్, సెలవులు, యూనిఫామ్, బూట్లు, అంబు లెన్స్, రెస్టు రూమ్ తదితర సౌకర్యాలు కల్పించాలని చట్టం చెబుతున్నా.. వాటిని అమలు చేయడం లేదన్నారు. జీఓ 117 ప్రకార వేతనాలు చెల్లించడం లేదన్నారు. అనేక ఏండ్ల నుంచి పని చేయించుకున్నప్పటికీ పర్మనెంట్ చేయక పోవడం విచారకరమన్నారు. వెంటనే కాంటాక్ట్ కార్మికులం దరినీ, ఆపరేటర్లందరినీ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం పరిశ్రమలో ఉన్న సిబ్బందికి ఇంక్ర ిమెంట్లు వేస్తున్నప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచడం లేదన్నారు. కాంటాక్ట్ కార్మికులకు అందరికీ ప్రతి సంవత్సరం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మైలాన్, హెట్రో డ్రగ్స్‌లలో కార్మిక హక్కులు అమలు చేయక పోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుధాకర్, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చిరుధాన్యాల విత్తనాలు అందజేత



నవతెలంగాణ-జహీరాబాద్

రైతులకు పప్పుదినుసుల, చిరుధాన్యాల విత్తనాల మినికిట్స్ బ్యాగులను మంగళవారం అందజేసినట్టు వ్యవసాయ శాఖ ఏడి బిక్షపతి తెలిపారు. పప్పు దినుసుల సాగు, నూనె గింజల చిరుధన్యాల సాగు ప్రోతహకంలో భాగంగా ఈ వానాకాలంలో వందశాతం సబ్సిడీతో చిరుసం చుల(మినికిట్స్)ను డివిజన్ వ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. ఈ నూతన చిరుసంచుల రకాల్లో మంచి యాజ మాన్య పద్ధతులు పాటించి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. అలాగే ఈ పంట విత్తనాలను మార్కెట్లో అమ్మకుండా ఆ విత్తనాలను రైతుస్థాయిలో మిగతా రైతులకు ఇచ్చి వచ్చే వానాకాలంలో విత్తుకోవచ్చు అని తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా సోయాబీన్ (డి.బి.ఎస్-1) అనే నూతన రకం చిరుసంచులు 49.2 క్వింటాళ్లు కేటా యించడం జరిగిందన్నారు. అలాగే మినుము (జీబి 1) అనే రకాన్ని డివిజన్‌కి 71 క్వింటాళ్లు కేటాయించారన్నారు. కంద ులు-176 అనే రకం (131 క్వింటాళ్లు) , ఎల్ఆర్‌జీ-52 అనే రకం (41 క్వింటాళ్లు), డబ్ల్యూఆర్‌జీఈ-93 అనే రకం (2క్వింటాళ్లు), డబ్ల్యూఆర్‌జీఈ-97 అనే రకం (30క్వింటాళ్లు) డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకి కేటాయించినట్టు చెప్పారు. చిరుధాన్యాల ప్రోత్సహకంలో భాగంగా రాగి (వి ఎల్-376) అనే నూతన రకం డివిజన్‌కి 1 క్వింటాల్ కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి వీరేందర్, రైతులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన భోగిని కవిత అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలిది పేద కుటుంబం కావడంతో.. బీఆర్ఎస్ గ్రామ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వెంటనే స్పందించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ.. అంత్యక్రియలకు తనవంతు సాయంగా పదివేల ఆర్థిక సాయాన్ని గ్రామబీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా అందజేయించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ సర్పంచ్ మేడిపల్లి మురళి బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు రుక్మారెడ్డి సంఘం శేఖర్ గౌడ్, లక్ష్మణ్, దర్గా బిక్షపతి, దర్గా శ్రీనివాస్, ఆలేటి శ్రీనివాస్, మహేష్, కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలైన నారా యణఖేడ్, బొమ్మారెడ్డి గూడెం, హత్నూర, ప్రీ. మెట్రిక్ సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట్, సిరిపుర, పోస్ట్‌మెట్రిక్ సంగారెడ్డి, నారాయణఖేడ్ హాస్టళ్లలో 2023-24 సంవత్స రానికి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేయడానికి ఏఎన్ఎం పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపా రు. అభ్యర్థులు 18 - 44 ఏండ్ల మధ్య ఉండి.. ఎస్ఎస్సి/ ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలో 18నెలల ఏఎన్ఎం శిక్షణలో ఉత్తీరు ణులై ఉండాలని లేదా దాని కి సమానమైన అర్హత కలిగి ఉండా లన్నారు. https://tsobmms.cgg.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలన్నారు. గిరిజన విద్యా సంస్థల్లో పనిచే సిన అనుభవం కలిగిన వారికి 20శాతం వెయిటేజ్ ఉంటుందన్నారు. (ఒక సంవత్సరానికి గాను 5శాతం చొప్పు న, గరిష్ఠంగా 4 ఏండ్లకు వెయిటేజ్ ఇస్తారన్నారు. అర్హత పరీక్షలో మెరిట్ మార్కులు, టిడబ్ల్యూడి విద్యా సంస్థల్లో పనిచేసిన అనుభవానికి వెయిటేజ్ ద్వారా ఎంపిక చేస్తార న్నారు. మొత్తం 12 పోస్టులు ఉన్నాయని.. వేతనం రూ.22,750 ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఇస్తారన్నారు. గిరిజన బాలికల పాఠశాలలో కేవలం మహిళలు మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్య ర్థులు తమ దరఖాస్తును అవసరమైన అన్ని పత్రాలతో ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 13లోపు సమర్పించాల న్నారు. మరిన్ని వివరాల కోసం 910032533 నెంబరుకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సంప్రదించాలని సూచించారు.

గీతమ్‌లో నూతన విద్యా విధానం

- జాతీయ విద్యా విధానం-2020 అమలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

అత్యుత్తమ విద్యకు చిరునామాగా పేరెన్నిక గన్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి (జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా) నాలుగేళ్ల డిగ్రీ (హానర్స్) కోర్సులను ప్రారంభిస్తోందని అడ్మిష న్స్ డైరెక్టర్ డాక్టర్ సి.ఉదయ కుమార్ వెల్లడించారు. ఈ నాలుగేళ్ల కోర్సులో విద్యార్థులకు క్లిష్టమైన సమస్య-పరి ష్కారం, విమర్శనాత్మక ఆలోచన, భావ ప్రకటనా (కమ్యూ నికేషన్) నైపుణ్యాలతో పాటుగా కళలు (ఆర్ట్స్), మానవీయ శాస్త్రాలు (హ్యుమానిటీస్), మేనేజ్మెంట్, సైన్స్‌లోని అంతర్ విభాగ పాఠ్యాంశాలను మేజర్, మైనర్లగా అభ్యసించవచ్చని తెలియజేశారు. గీతం కొత్త లిబరల్ ఎడ్యుకేషన్ (ఉదార విద్య) ప్రకారం, విద్యార్థులు బీఏ, బీబీఏ, బీఎస్సీలలో దేనిలో చేరినా, మొదటి సెమిస్టర్ లో అంతా ఒకే రకమైన పాఠ్యాం శాలను అభ్యసిస్తారని, రెండో సెమిస్టర్లో విద్యార్థులు కావాల నుకుంటే ఈ మూడింటిలో ఒకదాని నుంచి మరో కోర్సుకు మారవచ్చన్నారు. బీఏలో ప్రవేశం పొందినవారు అందులో నుంచి ఎక్కువ పాఠ్యాంశాలతో (60 క్రెడిట్లు) పాటు కొన్ని పాఠ్యాంశాలను (24 క్రెడిట్లు) బీబీఏ లేదా బీఎస్సీ నుంచి కూడా తీసుకోవచ్చన్నారు. మనదేశంలోని 19 కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో సహా 105 వర్సిటీలు ఈ నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సును 2023-24 విద్యా సంవ త్సరం నుంచి ప్రారంభిస్తున్నాయని, అందులో గీతమ్ కూడా ఒకటని చెప్పారు. గీతం విశాఖపట్నం, హైదం ాబాద్, బెంగళూరు ప్రాంగ ణాలలో ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్మెం ట్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, బీ-ఆప్టోమెట్రీ, పబ్లిక్ పాలసీ, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్, లా, మెడికల్, నర్సింగ్, ఫిజియో థెరపీ, పారామెడికల్ వంటి వృత్తివిద్యా కోర్సులను నిర్వహిస్తోం దన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆకర్షణీయమైన ఉపకార వేతనాలు (గత ఏడాది దాదాపు రూ.23 కోట్ల స్కాలర్షిప్) ఇచ్చి ప్రోత్సహిస్తోందన్నారు. గీతం ప్రవేశ పరీక్ష (గాట్-2023) ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నట్టు అడ్మిషన్స్ డైరెక్టర్ తెలిపారు.ఇతర వివరాల కోసం ప్రవేశాల విభాగాధిపతి డాక్టర్ శివకుమార్ 9542424256/59ను సంప్రదించాలని లేదా www.gitam.eduను సందర్శించాలని సూచించారు.

తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా వెంకట్



నవతెలంగాణ-సదాశివపేట

తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా సదాశిపేటకు చెందిన దొడ్ల వెంకట్‌ను పార్టీ రాష్ట్ర నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మంగళవారం ఆయన్ను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకట్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఓటు వేసే యంత్రాలుగా మార్చిందని దుయ్యబట్టారు. ఏ ఒక్క వర్గానికి సరైన న్యాయం చేయకపోగా ప్రజా ధనాన్ని వృథా చేస్తూ.. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ఉచిత హామీలతో రాష్ట్ర ప్రజలను సోమరులుగా మారు స్తున్నారన్నారు. ప్రజలకు కావాల్సింది నాణ్యమైన ఉచిత విద్య, ఉచిత వైద్యం అని.. కానీ రాజకీయ స్వార్థం కోసం ఉచిత పథకాలంటూ ఐదు లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని అధో:గతి పాలు చేశారని ఆరోపించారు. ప్రజలు నిజాయి తీగా డబ్బుకు మద్యానికి దూరంగా ఉన్నప్పుడే రాష్ట్రానికి మంచి నాయకుడు వస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త బస్వరాజ్ పాటిల్, పార్టీ రాష్ట్ర నాయకులు కే.వెంకట్ రెడ్డి, కట్కం విరేష్ గుప్త,బ్రహ్మ చారి, ఫయాజ్, విరెష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఆన్, ఆఫ్‌లు వెంటనే బిగించాలి

- కంచెలు ఏర్పాటు చేయాలి
- సీపీఐ(ఎం) అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్



నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న విలేజ్ మరియు అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఆన్, ఆఫ్‌లు లేకపో వడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. వెంటనే వాటిని బిగించాలని సీపీఐ(ఎం) ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం జోగిపేటలో కరెంటు డివిజనల్ ఇంజనీరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌కు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ.. వివిధ గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఆన్, ఆఫ్ లేక అత్యవసర పరిస్థితుల్లో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నా యన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ కంచెలు లేక.. పశువులు అనేకమార్లు విద్యుద్ఘాతంతో మృత్యువాత పడ్డా యని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కరెంటు తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని.. అవస రమైన చోట స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు బిగించ ాలన్నారు. కోడెకల్ గ్రామంలో 10 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండగా ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు కూడా ఆన్, ఆఫ్ లేదని గుర్తు చేశారు. విలేజ్ మరియు అగ్రికల్చర్‌కు కరెంట్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఏ ఒక్క దానికి కూడా ఆన్, ఆఫ్ లేకపోవ డంతో.. చిన్నచిన్న పనులకే ఎల్‌సి తీసుకునే పరిస్థితి ఏర్ప డిందన్నారు. రైతులు డీడీలు కట్టినా స్తంభాలు ఇవ్వడంలో సంబంధిత అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు జగన్ రెడ్డి, శంకరయ్య, నరసయ్య, భోజరెడ్డి, కొమురయ్య, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్విజ్ పోటీలు








నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించినట్టు మండల విద్యాధికారి డి.అంజయ్య తెలిపా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యా ర్థులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన చేయడానికి జాతీయ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు భారత దేశమంతటా ఈ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. కాగా 13 పాఠశాలలు క్విజ్ పోటీలో పాల్గొన్నాయన్నారు. అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందికందికి మొదటి బహుమతి, ప్రభుత్వ పాఠశాల సదాశివపేటకు రెండో బహుమతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరూర్‌కు మూడో బహుమతి వచ్చింది. మొదటి బహుమతికి రూ.5000, రెండుకు రూ.4000, మూడుకు రూ.3000 నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు ఉపాధ్యాయులు, సిఆర్పిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునిపల్లి : అఖిలభారత ఫైనాన్సియల్ లీటరెసీ మండల స్థాయి క్విజ్ పోటీల్లో అంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు మొదటి బహుమతి లభించింది. మండల విద్యా ధికారి దశరత్, బ్యాంక్ మేనేజర్ సైదులు, అంతారం ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రథ మ బహుమతి గెలిచిన పాఠశాల విద్యార్థులకు జులై 4న జిల్లా స్థాయి పోటీ సంగారెడ్డిలో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక అక్షరాస్యత అందరికీ అవ సరమని.. సైబర్ నేరాలపై అందరు అప్రమత్తతతో ఉండాల ని బ్యాంక్ మేనేజర్ తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్య త మరియు బ్యాంకులో పనితీరుపై అవగాహన కల్పించారు.

న్యాల్‌కల్ : మండలానికి సంబంధించిన క్విజ్ పోటీలను రాయికోడ్ మండలంలో నిర్వహించారు. ఈ పోటీల్లో మిర్జాపూర్(బి) పాఠశాలకు చెందిన సాదియా నౌసీన్ అనే విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి, చాల్కీ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మనస్విని, జ్యోతి ర్మయి రెండో బహుమతిని గెలుచుకున్నారు. కాగా మొదటి బహుమతి పొందిన విద్యార్థికి రూ.5వేలు, రెండో బహువ ుతి పొందిన విద్యార్థులకు రూ.4వేల నగదును అందజే శారు. మండల స్థాయిలో గెలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, కృష్ణ కుమార్, రాజు నాయక్ ఉన్నారు.



వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

మెదక్ ట్రాన్స్ కో ఎస్ఈ జానకిరాములు



నవతెలంగాణ-మెదక్

వర్షాలు, ఈదురుగాలులు వీస్తున్నందున కరెంట్ విషయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ ఎలక్ట్రిసిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్.ఈ) జానకిరాములు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ఆయా పట్టణాలు, గ్రామాల్లోని ఇళ్లు, పొలాల వద్ద కరెంట్ పరికరాలను తడిచేతితో తాకకూడదన్నారు. అలాగే కరెంట్ పోల్స్‌ను ఎవరూ ముట్టుకోవద్దన్నారు. రైతులు గ్రామాల్లో, పొలాల్లో తెలిసీ తెలియక సరైన జాగ్రత్తలు తీసుకోకుండా లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలి మృత్యువాత పడుతున్నారన్నారు. రైతులు ఎవరూ తొందరపడి కరెంట్ వైర్లు, లైన్లను తాకరాదని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా కరెంట్ తీగలు తెగిపడినా, ట్రాన్స్‌ఫార్మర్ మరమత్తుల కోసం వెంటనే ఆ ప్రాంతంలోని ఆఫీస్, లైన్ మెన్, ఏఈలకు సమాచారం అందించాలన్నారు. ఈ విషయంలో ప్రజలు విద్యుత్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

వివాదాస్పద స్థలంలోకి ఎవరు వెళ్లరాదు

సీఐ షేక్ లాల్ మదార్



నవతెలంగాణ-నర్సాపూర్

వివాదాస్పద స్థలంలోకి ఎవరు వెళ్లకూడదని నర్సాపూర్ సీఐ షేక్ లాల్ మదార్ నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్ తుర్తి గ్రామస్తులకు సూచించారు. మంగళవారం చిప్పల్‌తుర్తి గ్రామంలో వివాదాస్పదంలో ఉన్న భూమిలో దళితులు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా, అగ్రవర్ణాలకు చెందిన వారు వ్యతిరేకించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న సిఐ షేక్ లాల్ మదర్, ఎస్సై శివ కుమార్ వారి సిబ్బందితో చిప్పల్ తుర్తి గ్రామానికి చేరుకొని ఇరు వర్గాలను సముదాయించి నచ్చ చెప్పడంతో శాంతించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ స్థల వివాదం పరిష్కారం అయ్యేవరకు ఎవరు అట్టి స్థలం వద్దకు వెళ్లకూడదని ఇరు వర్గాలకు సూచించారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కూచారంకు బస్సు సౌకర్యం కల్పించాలి

బీఆర్ఎస్ నాయకులు ఉదయ్ రంజన్‌గౌడ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మండలంలోని కూచారం గ్రామానికి ఆర్టీసీ బస్ సౌకర్యం లేకపోవడంతో పదవ తరగతి విద్యార్థులతో పాటు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెంటనే కూచారం గ్రామానికి బస్ సౌకర్యాన్ని కల్పించాలంటూ మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్‌కు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు నాయిని ఉదయ్ రంజన్‌గౌడ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కాళ్ళకల్ గ్రామం వరకు మాత్రమే బస్ వస్తుందని, దానిని కూచారం గ్రామం వరకు పొడిగించాలన్నారు. దాంతో కళాశాలలకు, ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దాంతో డిపో మేనేజర్ సుధాకర్ స్పందించి వచ్చే నెల 1వ తేదీ నుంచి బస్సును పొడిగిస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు ఉదయ్‌రంజన్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ గుజ్జి రఘు, నాయకులు జక్కిడి సుధాకర్‌రెడ్డి, కృష్ణ, సామ్యూల్, రత్నం పాల్గొన్నారు.

మెదక్ డిపోలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-మెదక్ టౌన్

జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని బస్ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 50 మంది రక్తదానం చేశారని మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవిచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, ఏఎంఎఫ్ తిరుమలేష్, పి ఎస్ రెడ్డి, పిఆర్ ఓ రమేష్, మెదక్ డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలి

మండల ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్



నవతెలంగాణ-వెల్దుర్తి

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ముదిరాజులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం వారు మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా ముదిరాజ్‌లు ఉన్నారని, కేసీఆర్ ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేస్తూ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ముదిరాజులకు ఎక్కడ దొరికినా అంతు చూస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పడి నరసింహులు, రాష్ట్ర ఫిషర్ మెన్ కార్యదర్శి తలారి మల్లేశం ముదిరాజ్, సంఘం మండలం నాయకులు నర్సింలు స్వామి తదితరులు పాల్గొన్నారు.

విధిగా ఈకేవైసీ చేసుకోవాలి



నవ తెలంగాణ-నిజాంపేట

ఇప్పటివరకు పీఎం కిసాన్ ఈకేవైసీ చేసుకోని రైతులు విధిగా ఈ కేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సతీష్ తెలిపారు. ఈకేవైసీ చేసుకున్న వారు మాత్రమే 14వ విడత నగదు పొందుతారని ఆయన తెలిపారు. ఆధార్ కార్డ్‌కి మొబైల్ నంబర్ లింక్ లేని వారు, బయోమెట్రిక్ ద్వార గాని, పీఎం కిసాన్ స్పెషల్ ఆప్ ద్వారాకాని ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. మండలంలోని మొత్తం 5502 పిఎం కిసాన్ లబ్దిదారులలో 5060 మంది ఈకేవైసీ చేసుకున్నారన్నారు. ఇంకా 442 మంది ఈకేవైసీ చేసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీలత, కావేరి, గణేష్ రైతులు, పాల్గొన్నారు.

సమ్మెకు నోటీసు అందజేత



నవతెలంగాణ-నిజాంపేట

గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్, మండల అధ్యక్షులు ప్రవీణ్ రాజశేఖర్ కోరారు. వచ్చేనెల 5వ తేదీ వరకు సమస్యల పై చర్చలకు పిలవకపోతే 6 నుంచి సమ్మె బాట పడతామంటూ ఇంచార్జ్ ఎంపీడీవో రాజేందర్‌కు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించని యెడల సమ్మె బాట పడతామన్నారు. మండల పరిధిలోని కార్మికులు మంగళవారం నోటీసు అందజేశామన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కేటగిరి వారిగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి తమ సమస్యల పరిష్కారానికి పలుమార్లు వినతి పత్రం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఎల్లయ్య, తిరుమల్, రాజు , మల్లేశం, రవి, పోచవ్వ, జమున , ఇంద్ర ఎల్లవ్వ పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీల్లో కనీస వసతులు కరవు

దుర్గంధంతో పేదల ఇబ్బందులు, పట్టించుకోని అధికారులు

హవేలీ ఘనాపూర్‌లో కాంగ్రెస్ నేత మ్యాడమ్ బాలకృష్ణ పర్యటన



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించిన కాలనీలో కనీస వసతులు కరువయ్యాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు మంగళవారం ఆయన మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీని కాంగ్రెస్ నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులతో సమావేశమయ్యారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు పడక గదుల నిర్మాణం చేపట్టిన అధికారులు ఆయా కాలనీల్లో వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక నిరుపేదలు నివాసం ఉండలేకపోతున్నారన్నారు. ఈ విషయంలో అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన కరువైందని మండిపడ్డారు. ఈ పరిస్థితిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ హఫీజ్, మండల కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అక్బర్, మండల ఎస్సీ ప్రెసిడెంట్ మొండి పద్మారావు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ సల్మాన్ జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్, బొగడ భూపతిపూర్ సంజీవ్, కోఆర్డినేటర్ నవీన్ చౌదరి, అన్వార్, అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పనులకు బిల్లులు రాక సర్పంచ్‌ల ఆవేదన

- సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీపీ నారాయణ రెడ్డి హామీ



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

గ్రామాలలో ప్రభుత్వం సూచించిన పనులకు లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపడితే బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తలపెట్టిన కంటి వెలుగు, దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్, ఎంపిటిసిలకు దిశా నిర్దేశం చేయగా స్థానిక అధికారుల ఆదేశాలతో కంటి వెలుగు, దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వాటికి సరిపడా బిల్లులు అందలేదని సర్వసభ్య సమావేశంలో సర్పంచులు వాపోయారు.సర్పంచ్‌ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని ఎంపీపీ నారాయణరెడ్డి తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి కొంతమంది అధికారులు గైర్హాజరు కావడంతో సమావేశంలో పర్ధన సర్పంచ్ సుభాష్ మండిపడ్డారు. వాడి సర్పంచ్ యామి రెడ్డి మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు పోడు భూములపై పట్టాలలను లబ్దిదారులకు ఎప్పుడు పట్టాలు అందజేస్తారని ప్రశ్నించారు. కొంతమంది గిరిజన కుటుంబాలు కబ్జాలో ఉన్న భూమిలో సాగు చేస్తుంటే అటవీ శాఖ అధికారులు అన్యాయంగా కేసులు పెడుతున్నారన్నారు. మండలంలో విద్యుత్ విషయంపై చర్చకు రాగా నాగపూర్ సర్పంచ్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో 400 ఇండ్లు ఉంటే 150 మీటర్లు మాత్రమే ఉన్నాయని, మిగతావారు బిల్లు కట్టకుండా కరెంటు వాడుతున్నారని తెలిపారు. మండలంలో ఏ గ్రామానికి స్తంభాలు అవసరం ఉంటే రైతులను తిప్పుకోకుండా కావలసిన కరెంట్ స్తంభాలు అందజేయాలని ఏఈ వినోద్‌ను కోరారు. సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలని మండల వైద్యాధికారిని కోరారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వ నిధులు సరిపోవలేదని ఒక్కొక్క సర్పంచ్ జేబులో నుంచి డబ్బులు వేసుకొని ఉత్సవాలు ఘనంగా నిర్వహించామని లింగ్సాన్ పల్లి సర్పంచ్ మహిపాల్ రెడ్డి తెలిపారు. అనంతరం సభను ఉద్దేశించి ఎంపీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ సమస్యలు జిల్లా కలెక్టర్, మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫరీద్పూర్ ఏసీఎస్ చైర్మన్ బ్రహ్మం, జడ్పిటిసి సుజాత శ్రీనివాస్ రెడ్డి ఎంపీడీవో శ్రీరామ్ నాగపురం పిఎసిఎస్ చైర్మన్ శ్రీహరి, సర్పంచులు లక్ష్మీనారాయణ, కిషన్ నాయక్ ,లింగం, ఎంపీటీసీలు అర్చన శ్రీనివాస్, జ్యోతి సిద్ధి రెడ్డి, స్వప్న దుర్గారావు, మంగ్య, రాజయ్య, మండల వ్యవసాయ అధికారి నాగ మాధురి, ఆర్ ఐ మహేష్, వివిధ శాఖల అధికారులు సల్మాన్, శ్రీహరి ,రాజ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకు రెడ్ క్రాస్ సేవలు విస్తరించాలి

- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ శాఖ అధ్యక్షులు, కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

మారుమూల ప్రాంతాలకు రెడ్ క్రాస్ సేవలు విస్తరించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ శాఖ అధ్యక్షులు, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం నూతనంగా ఎన్నుకున్న మెదక్ రెడ్ క్రాస్ కమిటీ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే రక్తనిధి కేంద్రాన్ని, వృద్ధులకు ఆశ్రమాన్ని, ఇతర సేవా కార్యక్రమాలను కొనసాగించడానికి పక్కా భవనానికి ఒక ఎకరం స్థలం కేటాయించాలని మెదక్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి కలెక్టర్‌ను కోరారు. అలాగే ప్రస్తుత కలెక్టరేట్‌లో తమకు ఓ గదిని ఇప్పించాలని కోరగా, నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఒక గదిని కేటాయిస్తామని కలెక్టర్ సభ్యులకు హామీ ఇచ్చారు. రక్తనిధి కేంద్రాన్ని, వృద్ధాశ్రమాన్ని నిర్మించడానికి తప్పకుండా ప్రయత్నిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మేనేజింగ్ కమిటీ మెంబర్ సింగం శ్రీనివాసరావు భవిష్యత్తులో రక్తనిధి కేంద్రం, మొబైల్ వ్యాన్ కొరకు ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందజేశారు. నూతన సభ్యుల చేరికకు కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్ , ఆర్డీఓ సాయిరాం, ఎస్పీ రోహిణి ప్రియదర్శినిలను కలిసి సన్మానించి, సేవకార్యక్రమాల నిర్వహణకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, కోశాధికారి శ్రీనివాస్ శర్మ, నిర్వహణ సభ్యులు ప్రభురెడ్డి, యాదగిరి, సత్యనారాయణ, రమేష్, దామోదర్ రావు, ప్రసాద్, గోవింద్, నవాజ్ పాల్గొన్నారు.

కాల్వ పనులకు భూములు ఇచ్చేది లేదు

- గ్రామ సభలో రైతులు



నవతెలంగాణ- నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం కాళేశ్వరం కాల్వ భూనిర్వాసితులు భూములు కోల్పోతున్న 40 మంది రైతులతో మండల తహసిల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభకు మెదక్ ఆర్డిఓ ఆఫీసర్ సత్యనారాయణ హాజరైనారు. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ ప్రభాకర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 13 మల్లన్న సాగర్ కాలువ ద్వారా డిస్ట్రిబ్యూషన్ కెనాల్ కాల్వ నిర్మాణం కొరకు 40 మంది రైతులకు సంబంధించి 12 ఎకరాల భూమిలో గల కాల్వ పనులు చేపట్టడానికి భూములు ఇవ్వాలని కోరారు. తమ భూముల్లో నుంచి కాల్వ పనులు జరగనివ్వమని తహసీల్దార్‌కు రైతులు డిమాండ్స్ పత్రాన్ని అందజేశారు. ఈ కాళేశ్వరం కాలువ పనులకు రైతులు భూములు ఇవ్వమని కరాకండిగా అధికారులకు తెలిపారు. ఈ కాలువ ద్వారా మాకు ఎలాంటి ఉపయోగం లేదని, ప్రాణాలైనా అర్పిస్తాం కానీ ఈ కాల్వపనులు జరగనివ్వమని అధికారులకు హెచ్చరించారు. రైతులు ఇచ్చిన నివేదికను పై అధికారులకు పంపిస్తామని తహసిల్దార్ ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రీతి, అర్ఐ గంగాధర్ గౌడ్,కార్యదర్శి అరిఫ్ హుస్సేన్, రైతులు ప్రభాకర్, నర్సారెడ్డి, రాంచంద్రం,మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడిలో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు చేయాలి

- సీడీపీవో హేమా భార్గవి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ప్రతి అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలకు మంచి న్యూట్రీన్స్ అందించే విధంగా స్కూలులో న్యూట్రీ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలని నర్సాపూర్ సీడీపీవో హేమా బార్గవి ఆదేశించారు. మంగళవారం మండలంలోని కాళ్ళకల్ 1వ అంగన్‌వాడి కేంద్రంలో మండల సెక్టార్ మీటింగ్‌ను ఏర్పాటు చేయగా సీడీపీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల ఫ్రీ స్కూల్ ఆక్టివిటీస్‌పై సలహాలు సూచనలు చేశారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా పిల్లలను ఆట, పాటలు, కథలతో పాటు తెలుగు, ఇంగ్లీష్ పద్యాలు, సృజనాత్మకత కార్యక్రమాలతో పిల్లల అభివృద్ధిని మేధో వికాసాన్ని పెంచాలని సూచించారు. పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని టీచర్లకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. అలాగే ప్రతి అంగన్‌వాడి కేంద్రంలో న్యూట్రీ గార్డెన్స్‌లను తప్పక ఏర్పాటు చేయాలని సీడీపీవో హెమా భార్గవి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ సక్కుబాయి, మండల అంగన్‌వాడి టీచర్లు తదితరులు హజరయ్యారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-మెదక్

ఆర్యవైశ్య కార్పొరషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహా సభ సభ్యులు కలెక్టర్ రాజర్షి షాకు మంగళవారం కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహా సభ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అగ్రవర్ణాలకు చెందినవారు కావడంతో పలు ప్రభుత్వ పథకాలకు నోచుకోలేకపోతున్నారని తెలిపారు. బీద ఆర్యవైశ్యుల సంక్షేమార్థం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచినప్పటికీ, ఇటీవల జరిగిన మునుగోడు, నాగార్జున్ సాగర్, హుజూరాబాద్ ఉప ఎనికల సందర్భంగా కూడా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ, కార్యరూపం దాల్చలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వీలు కాదని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేసి బీద ఆర్యవైశ్యులకు లబ్ధి చేకూర్చేందుకు సహకరించాల్సిలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి శివరామ కృష్ణ, కోశాధికారి రవీందర్ గుప్తా, అదనపు కార్యదర్శి వెంకటనారాయణ, పుండరీకం, శ్రీధర్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కళ్యాణోత్సవం

అంగరంగ వైభవంగా బోనాల ఊరేగింపు

కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్, అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్‌లు



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం గత రెండు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ నెల 25న ఆదివారం ఉదయం గణపతి పూజ పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, చండీ హెూమాలు, 26 సోమవారం ఉదయం లందకు పోవుట, సాయంత్రం పుట్ట బంగారం, గంగ తెప్పకుపోవుట, 27 మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఘటం ఊరేగింపు, కట్నాం, అనంతరం రేణుకా ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు చేపట్టారు. కళ్యాణ మహోత్సవానికి జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్, గజ్వెల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ పంజా లక్ష్మి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, పంజా భిక్షపతి, మండల వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డి, పురం రవిముదిరాజ్, ఎంపీటీసి పొట్టోల్ల లత వెంకట్‌గౌడ్, ఇమాంపురం శేఖర్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్ ముదిరాజ్, సర్పంచ్‌లు నర్సయ్య నాగభూషణం, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు పంచమి రేణుకుమార్, శ్రీహరిగౌడ్, దండుపల్లి ఉపసర్పంచ్ మహెందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు హజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆషాడ మాస బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. రేణుకా ఎల్లమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని చల్లగా చూడాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

- పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు అంజిబాబు



నవతెలంగాణ-రేగోడు

మండలంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని పిఆర్టియు మండల అధ్యక్షులు అంజిబాబు తెలిపారు. మండల పిఆర్టియు ఆధ్వర్యంలో మెదక్ జిల్లా విద్యాధికారి రాదాకిషన్‌కు ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరుతూ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేనందున బోధన సక్రమంగా జరగడం లేదన్నారు. మండలంలో 21 ప్రాథమిక పాఠశాలలో ఉండగా అందులో 13 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని, అందులో ఈ సంవత్సరం నలుగురు మహిళా ఉపాధ్యాయులు మాతృత్వ సెలవులపై వెళ్లారన్నారు. వారి స్థానంలో వెంటనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. ఉన్నత పాఠశాల లింగంపల్లి, ఉన్నత పాఠశాల జగిరయాల, ఉన్నత పాఠశాల గజవాడలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇలాగే జరిగితే సరైన ఉపాధ్యాయులు లేని కారణం వల్ల విద్యార్థులు అందరూ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడానికి ఆసక్తి కనబరుస్తారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రేగోడు మండల విద్యా వ్యవస్థలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చి, విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా పిఆర్టియు టిఎస్ ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ, మెదక్ జిల్లా పిఆర్టియు జిల్లా బాధ్యులు వెంకన్న , పిఆర్టియు బాధ్యులు ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓగా బాధ్యతలు చేపట్టిన శరత్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-చిలిపిచేడ్ : చిలిపిచేడ్ మండల ఎంపీఓగా మంగళవారం శరత్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. రేగోడు మండలం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి చిలిపిచెడు మండల ఎంపీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని సందర్శించి గ్రామాలను అభివృద్ధి దిశగా నడుపుతానని తెలిపారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

- మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మున్సిపల్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి నాణ్యతతో చేపట్టాలని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్ పేర్కొన్నారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. వార్డులో తిరుగుతూ సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వర్షాకాలం సీజన్ కావడంతో ప్రజలంతా వీదులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తా చెదారం లేకుండా ఎప్పటి కప్పుడు చెత్త సేకరణకు వచ్చే వాహనంలోనే చెత్తను వేసి మున్సిపల్‌ను స్వచ్ఛ మున్సిపల్‌గా తయారుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం మండల కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గణేష్ గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

తెలంగాణ గౌడ సంఘం నర్సాపూర్ మండల కమిటీని మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నర్సాపూర్ మండల అధ్యక్షులుగా నర్సాపూర్ పట్టణానికి చెందిన దుర్గాప్ప గారి ఆంజనేయులు గౌడ్, ఉపాధ్యక్షులుగా అశోక్ గౌడ్, రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉసిరిక పల్లి గణేష్ గౌడ్,, కార్యదర్శులుగా కర్రె నరేష్, తాడిపల్లి అశోక్, అధికార ప్రతినిధి రాజు గౌడ్, కోశాధికారి కట్నం బిక్షపతి గౌడ్, ప్రచార కార్యదర్శి దేవా గౌడ్, యాదగిరి గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ గౌడ్, నాగరాజు గౌడ్, శివకుమార్ గౌడ్, రామకృష్ణ గౌడ్, రాకేష్ గౌడ్, సర్పంచ్ సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం మండల యూత్ అధ్యక్షులుగా సాయి శరణ్ గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

తెలంగాణ గౌడ సంఘం నర్సాపూర్ మండల యూత్ కమిటీని మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎన్నుకున్నారు. నర్సాపూర్ తెలంగాణ గౌడ సంఘం యూత్ మండల అధ్యక్షుడిగా మూసాపేట్ గ్రామానికి చెందిన సాయి చరణ్ గౌడ్ ఎన్నిక కాగా. ఉపాధ్యక్షులుగా మహేష్ గౌడ్, నాగరాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయిరాం గౌడ్, కార్యదర్శులు గా రామా గౌడ్ ,నరేష్ గౌడ్, అధికార ప్రతినిధి కృష్ణ గౌడ్, భూమా గౌడ్, కోశాధికారి ఆంజనేయులు గౌడ్ లను ఎన్నుకున్నారు ..

నవతెలంగాణ 4
సిద్దిపేట
బుధవారం 28 జూన్ 2023

దౌల్తాబాద్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ-దౌల్తాబాద్

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో దౌల్తాబాద్, రాయపోల్ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థిని విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల దౌల్తాబాద్‌లో వ్యాసరచన, క్విజ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలలో తిరుమలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అఖిల, మణికంఠ అనే విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. రెండో బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపోల్ మండల పరిధిలోని రామారం విద్యార్థులు కైవసం చేసుకున్నారు. విజేతలకు విజేత పత్రాలను మండల విద్యాధికారి బండి నరసవ్వ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ అశోక్‌తోపాటు దౌల్తాబాద్ పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రకాశం, ఉపాధ్యాయులు రత్నాకర్ రెడ్డి, గణేష్, విష్ణు ఉపాధ్యాయులు సి ఆర్ పి గాడి రాజు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి



- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి

నవతెలంగాణ-కొండపాక: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రమోద్ కుమార్‌లు అన్నారు. మంగళవారం కొండపాక మండలం దుద్దెడలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి అండగా నిలవాలన్నారు. పార్టీకి కార్యకర్తల బలం ఎంతో అవసరమని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కొండపాక మండల అధ్యక్షుడు వాసవి లింగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్షరెడ్డి, సిద్దిపేట జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులు జాకీర్ షరీఫ్, కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తడి స్థలంలో పశువుల సంత

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రంలోని పెద్ద చెరువు మత్తడి స్థలంలో జరిగే పశువుల సంత(అంగడి)ను మూడు సంవత్సరాల తర్వాత ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కూతురు తుల్జా భవాని రెడ్డి మంగళవారం ప్రారంభించారు. మూడు సంవత్సరాల క్రితం మత్తడి స్థలాన్ని కొన్నామని దాని చుట్టూ సిమెంట్ పలకలు వేసి ఎవరిని కూడా లోనికి అనుమతించకపోవడంతో అప్పటి నుంచి పశువుల సంత జరగడం లేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కూతురు తన పేరిట ఉన్న మత్తడి స్థలాన్ని మున్సిపాలిటీకి ఇస్తున్నానని చెప్పడంతో అక్కడ పశువుల సంతను తుల్జా భవాని రెడ్డి చేతుల మీదుగానే స్థానిక నాయకులు ప్రారంభింపచేశారు. అంతకు ముందు ఎదురుపడిన భవాని రెడ్డితో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి తాను మిమ్మల్ని ప్రేరేపించి ఇదంతా చేయిస్తున్నానని ఎమ్మెల్యే అంటున్నారని అనడంతో, తుల్జా భవాని రెడ్డి స్పందిస్తూ తాను కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని చూడడం ఇదే మొదటిసారని అన్నారు.

ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారు

కొమ్మూరి ప్రతాపరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ఇరిగేషన్ అధికారులను, ఇతర అధికారులను కానీ స్వేచ్ఛగా పని చేసుకోనిచ్చానని ప్రస్తుతం ఎమ్మెల్యే అధికారులను కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నడన్నారు. తాను చెప్పినట్టుగా వినేవిధంగా బెదిరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఎవరికీ తలొగ్గకుండా పనిచేయాలన్నారు. గతంలో దాదాపు 100 సంవత్సరాల క్రితం నుంచి కూడా మత్తడి నీరు చేర్యాల ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రైనేజీలో నుంచి వెళ్తూ కుడి చెరువులో కలిసేదని, మత్తడి నీరు ప్రకృతిరీత్యా ఎటు ఒంపు ఉంటే అటు వెళుతుందని అలా కాదని కొత్తగా మత్తడి భూమిలో నుంచి కాలువలు తీసి రైతుల భూములను కూడా లాక్కొని కెనాల్ నిర్మిస్తామనడం సరికాదన్నారు. ఈ మత్తడి భూమిలో ఇప్పటి నుంచి పశువుల సంత యధావిధిగా కొనసాగుతుందన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి, అతని బినామీలకు కలిపి దాదాపు 1000 ఎకరాల భూమి ఉంటుందని, స్థానికేతరుడు కాబట్టే స్థానిక ప్రజలను దోచుకుంటున్నాడని ఆరోపించారు. చేర్యాల ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారని త్వరలోనే అధికార పార్టీకి గట్టి గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు దాసరి కళావతి, కొమ్ము నర్సింగరావు, మత్తడి పరిరక్షణ సమితి చైర్మన్ అవుశర్ల యాదయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వెంకట మావో, తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి ఒగ్గురాజు, పిఎసిఎస్ డైరెక్టర్ వెలుగుల శ్రీనివాస్, రాళ్ల బండి నాగరాజు, బండ కింది అరుణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు రాగుల శ్రీనివాస్ రెడ్డి, వెలుగల దుర్గయ్య, దాసరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

క్విజ్ పోటీలలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఐ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించగా గురుకుల పాఠశాల విద్యార్థులు డి.వివేకవర్ధన్, బి.రాజేష్‌లకు మొదటి బహుమతి సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వి.చలపతి తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలలో ఎనిమిది పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. అలాగే ద్వితీయ బహుమతి కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొండల్‌రెడ్డి, అఖిలేశ్వర్, తృతీయ బహుమతి గుండారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శృతికీర్తన, ఎం.నందినిలు బహుమతులను గెలుపొందగా విద్యార్థులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మెనేజర్ మురళీధర్ చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ బృందాలలో స్వచ్ఛంద సంస్థల ప్రమేయం సరికాదు

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చిట్యాల విజయేందర్ రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్నా తొలి మెట్టు తనిఖీల్లో భాగంగా ఏర్పాటు చేసిన బృందాలలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఉపయోగించడం సరికాదని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు చిట్యాల విజయేందర్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయులకు ఇంతకన్నా అవమానం ఇంకోటి ఉండదన్నారు. ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేరే ఏ డిపార్ట్మెంట్‌లో స్వచ్ఛంద సంస్థలు తనిఖీలు నిర్వహిస్తున్నారా? మరి విద్యా సంస్థలపై మాత్రమే స్వచ్ఛంద సంస్థల తనిఖీలు ఎందుకని ప్రశ్నించారు. పాఠశాలలలో జరిగే వినూత్న కార్యక్రమాలపై కనీస అవగాహన కూడాలేని వ్యక్తులు, సంస్థలు తనిఖీలు నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. ఉపాధ్యాయులను అవమాన పరచడమేనన్నారు. విద్యా శాఖ కార్యదర్శి వీరిని నియమించడం శోచనీయమని, అసలే సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టడుతున్న ఉపాధ్యాయులపై స్వచ్ఛంద సంస్థల పెత్తనం ఏంటన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, ఉన్నత పాఠశాలల్లో తనకు సంబంధం లేని తరగతులను ఉపాధ్యాయులు బోధిస్తూ ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. విద్యాశాఖ స్వచ్ఛంద సంస్థలు తనిఖీల పేరుతో పాఠశాలకు పంపడం సరికాదని, వెంటనే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల బతుకులు మారతాయి

- మాజీ ఎమ్మెల్యే అలిగి ప్రవీణ్ రెడ్డి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు మారతాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగి ప్రవీణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలంలోని పోతారం (ఎస్) గ్రామంలో పల్లెపల్లెకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నెరవేర్చ బోయే హామీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కేడం లింగ మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంక చందు, అక్కన్న పేట మండల అధ్యక్షులు జంగ పల్లి అయిలయ్య, పోతుగంటి బాలయ్య, గుడాటి పల్లి సర్పంచ్ బద్దం రాజి రెడ్డి, వల్లపు రాజు, పూన్నా సది లావణ్య, మ్యాదర బోయిన శ్రీనివాస్, ఎగ్గిడి అయిలయ్య, గుర్రాల లింగా రెడ్డి, వెన్న రాజు, బూర్గు కిష్ట స్వామి, మాజీ ఎంపిటిసి బొమ్మగాని హరి బాబు పాల్గొన్నారు.

సత్య సూర్య కార్మికులకు సీఐటీయూ సంఘీభావం

నవతెలంగాణ-గజ్వేల్



వర్గల్ మండలం గౌరారం పరిధిలోని సత్య సూర్య అల్యూమినియం ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమలోని కార్మికుల వేతనం పెరుగుదల కోసం జరుగుతున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బండ్ల స్వామి మాట్లాడుతూ పరిశ్రమలో ఎలాంటి భద్రతా చర్యలు లేకుండా అభద్రతా పని ప్రదేశాలలో పనిచేయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సత్యసూర్య అల్యూమినియం పరిశ్రమ యాజమాన్యం చట్ట వ్యతిరేకమైన చర్యలను ఆపి కార్మికులకు రావలసిన న్యాయమైన సౌకర్యాలను ఇస్తూ వేతన ఒప్పందం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం చర్చలకు రానిపక్షంలో ఈ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిరాజ్, యూనియన్ నాయకులు సద్దాం, సుధాకర్, రాజు, మల్లేష్, అశోక్, నరేష్, లక్ష్మీ, ఊర్మిళ, శంకర్ కార్మికులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బ్లాక్‌బెల్ట్‌ల ప్రదానం

నవతెలంగాణ-సిద్దిపేట



జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, అసై షోటో ఖాన్ కరాటే- డో- అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కరాటే బ్లాక్ బెల్ట్ పోటీలను తుర్కపల్లి ఫారెస్ట్ ఏరియా టాలీవుడ్ స్టూడియోలో పోటీలను నిర్వహించగా, సిద్దిపేట జిల్లాకు చెందిన 31 మంది కరాటే చిన్నారులకు కరాటే బ్లాక్ బెల్ట్ లభించినట్లు అసోసియేషన్ చీఫ్, అధ్యక్షులు సెన్సాయి పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కటాస్, కిహాన్, కుమితే, వెపన్, బ్రేకింగ్ టెక్నిక్స్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ వివిధ అంశాలలో ఈ పోటీలను నిర్వహించారని, ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా తెలంగాణ జే.కే.ఎస్ కరాటే చీఫ్ ఇన్స్ట్రక్టర్ సెన్సాయి ఎం.ఎస్ పాషా బ్లాక్ బెల్ట్ సిక్స్ డిగ్రీ న్యాయ నిర్ణీతగా వ్యవహరించాడని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటులు, కరాటే లెజెండ్, ఇండియన్ కరాటే బ్రుస్లి, డాక్టర్ సుమన్ తల్వార్ విజేతలకు బ్లాక్ బెల్ట్‌లను, ధ్రువపత్రాలను అందజేసినట్లు తెలిపారు. శ్రీ మనస్విని, అస్మాతరనుం, అరిబా ఉన్నై, అబ్దుల్ ఆహాద్ అలీ, గాయత్రి, సాహితి, వర్షిత్, నిషిద్, నిరూపం, విఖ్యాతి రెడ్డి, అద్విక్, దుర్గాప్రసాద్, శ్రీవల్లి, విష్ణువర్ధన్, కొడరి రక్షిత్, మాడుగుల రేవంత్ సాయి, రాజ్ కుమార్, అభినవ్, అమర్, మహేష్, శ్యాంసుందర్, విశ్వ ప్రకాష్, రాకేష్, శశాంక్ రెడ్డి, ఉన్ని కృష్ణంరాజు, లోకేశ్వర్, శ్రీనిధి బాసరన్, శ్రీ నితి బాసరన్, ఉపాసన రాజ్, తపస్విని రాజ్, మనస్విని రాజ్ విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ లభించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. ఎల్లయ్య సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సుపరి ఎల్ల దాసు, విజ్ఞగిరి ప్రభాకర్, కే. మధు, పి. నవీన్ కుమార్, మొహమ్మద్ అహమద్,. కే. మల్లేశం పాల్గొన్నారు.

రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-తొగుట

కొత్తగా పట్టా పాస్ బుక్‌లు పొందిన రైతులు రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ నవీన్ తెలిపారు. జూన్ 16వ తేదీ 2023 వరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాళ్ళు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు సంతకం చేసిన దరకాస్తు పారం, ఫోటోతో కూడిన బ్యాంక్ పాస్ బుక్ (అకౌంట్ నంబర్ స్పష్టంగా)తో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ మండలం రిమ్మనగుడ గ్రామ సమీపంలోని రింగు రోడ్డు వద్ద గల సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఇటీవల విడుదలైన పిజి ఈసెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ మాచర్ల వెంకటరమణ తెలిపారు. మంగళవారం కళాశాలలో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బి.ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు పిజి చేయాలంటే పిజి ఈసెట్ అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఎంట్రెన్స్ రాసిన కళాశాల విద్యార్థులు ఇటీవల ఫలితాలు విడుదల కాగా కళాశాలకు చెందిన విద్యార్థులు పి. శ్రావణ కుమార్‌కు 204, జి.భావనకు 240, ఎండి ఐమన్‌కు 499, సిహెచ్. అశ్వినికి 537, ఎస్. వైష్ణవికి 569, ఎండి. జైనబ్ సుల్తానాకు 639, జి.భావనకు 729, అబ్దుల్ ఫైసల్‌కు 964 రాంకులతో పాటు మరో పది మంది విద్యార్థులకు మెరుగైన ర్యాంకులు వచ్చాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు రావడం సంతోషంగా ఉందని, కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి ఉత్తమ విద్యను అందించాలనే లక్ష్యంతో కళాశాల సెక్రెటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి కృషి చేస్తున్నారని తెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతూ, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని తెలిపారు. ఉన్నత చదువులకు వెళ్లని విద్యార్థులకు పలు ఫార్మా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఫార్మా రంగంలో ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని చెప్పారు. ఫార్మసీ చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర స్థాయి ర్యాంకులు వచ్చేలా కృషి చేసి ఉత్తమ విద్యార్థులను సమాజానికి అందిస్తామని తెలిపారు.



మహర్షి పేరుతో శ్రీ చైతన్య పాఠశాల నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు రంజిత్ రెడ్డి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంలో మహర్షి పేరుతో శ్రీ చైతన్య పాఠశాలను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ రెండు నెలలుగా చేర్యాల లో అడ్మిషన్ చేస్తూ ప్రచారం నిర్వహిస్తుండగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందనగానీ, చర్యలుగానీ లేవన్నారు. అధికారులు శ్రీ చైతన్య యాజమాన్యానికి అమ్ముడుపోయారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, నితిన్, రాకేష్, హరి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను బదనాం చేయడానికి యత్నం

- బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-చేర్యాల

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని బదనాం చేయడానికి ప్రతిపక్ష పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణ కేంద్రంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తప్పుడు ప్రకటనల ద్వారా ఎమ్మెల్యేపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాజకీయం చేయడానికి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పావులుగా వాడుకుంటూ ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. చేర్యాల ప్రాంతానికి తీరని ద్రోహం చేసి చేర్యాల నియోజకవర్గం పోవడం ఆయన హయంలోనే జరిగిందన్నారు. చేర్యాల ఆస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చిన వ్యక్తి ప్రతాప్ రెడ్డి అని అన్నారు. ఎమ్మెల్యే స్థానికత గురించి మాట్లాడే హక్కు కొమ్మూరికి లేదన్నారు. చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో కోట్ల విలువచేసే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి మునిసిపాలిటీకి ఇవ్వాల్సిన 10% భూమిని కూడా వదలని వ్యక్తి ఈ రోజు ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. తన సొంత గ్రామంలో ఎస్సీలకు చెందిన భూమిని తక్కువ ధరకు కొనుక్కొని వారికి ఇళ్ల స్థలాలు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. చేర్యాలలో స్మశాన వాటిక కోసం లక్ష రూపాయలు భయానా ఇచ్చి ఆ భూమిని ఆయన పేరిటనే రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం చేర్యాల ప్రజలందరికీ తెలుసన్నారు. పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తి కొమ్మూరి ప్రతాపరెడ్డి అని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల యూత్ అధ్యక్షుడు శివగారి అంజయ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు తాడెం రంజిత, పట్టణ యువత అధ్యక్షుడు యాట బిక్షపతి, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జిల్లా రాజేశం, బుట్టి ఆగమల్లు, నాయకులు ఇక్బాల్, తాడెం కృష్ణమూర్తి, రామగల్ల బాబు, నరసింహులు, బుడిగే శ్రీను పాల్గొన్నారు.



జులై 2న జిల్లా స్థాయి జూనియర్ టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట సరస్వతి శిశుమందిర్‌లో జూలై 2న జిల్లా స్థాయి జూనియర్ టాలెంట్ టెస్ట్ ఉంటుందని శ్రీ సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు తడకమడ్ల ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జూలై 2న సిద్దిపేట సరస్వతి శిశుమందిర్ లో నిర్వహించనున్న జిల్లా స్థాయి జూనియర్ టాలెంట్ టెస్ట్ కరపత్రికలను విద్యాపీఠం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో పోటీ తత్వం పెరగడంతో పాటు విజ్ఞానం పెరుగుతుందన్నారు. జిల్లా స్థాయి జూనియర్ టాలెంట్ టెస్ట్ పోటీలకు విద్యార్థుల పేరు నమోదు ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఈ పోటీ పరీక్షలు రెండు లెవెల్స్‌లో కొనసాగుతాయని తెలిపారు. నాలుగు, ఐదవ తరగతి విద్యార్థులకు లెవెల్ వన్ పరీక్షలు, 6, 7వ తరగతి విద్యార్థులకు లెవెల్ టుగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి రెండు లెవెల్స్‌లో మొదటి బహుమతి 5000, రెండవ బహుమతి 3000, మూడో బహుమతిగా వెయ్యి రూపాయల నగదు ప్రోత్సాహం అందిస్తామన్నారు. అలాగే నాలుగు, ఐదు, ఆరు, ఏడవ తరగతులలో మొదటి స్థానంలో నిలిచిన వారికి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం మొత్తం పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. ఈ పోటీలలో పాల్గొనేవారు రూ 100 రిజిస్ట్రేషన్ ఫీజు సరస్వతి శిశుమందిర్ లో చెల్లించాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే వారు 9966932727 నెంబర్‌కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అవకాశాన్ని సిద్దిపేట జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు పెద్ది వైకుంఠం, ప్రధానాచార్యులు మోతుకు నరేష్ కుమార్, కమిటీ సభ్యులు తుజాల్పురం కాశీనాథ్, గంప సుధాకర్, నారదాసు సతీష్, మోతుకు అనిత పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కారించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-మెదక్ టౌన్



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ముందున్న కిరణ షాపుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మురికి కాలువ వాసనకు విద్యార్థులు టీచర్లు క్లాస్ రూముల్లోనే వాంతులు చేసుకుంటున్నారని మున్సిపల్ అధికారులకు, కలెక్టర్‌కు కూడా తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలుగా జిల్లా అధికారుల ఆఫీస్ చుట్టూ తిప్పించుకుంటున్నారని, కానీ కళాశాల సమస్యను పరిష్కారం చేయడం లేదన్నారు. కళాశాల సమస్యను పరిష్కారం చేయాలని కళాశాల విద్యార్థులు వర్షంలో వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన స్పందించ లేకపోయారని వాపోయారు. కళాశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వల్ల ఆ మురికి కాలువ చుట్టూ పందులు పశువులు తిరుగుకుంటూ కళాశాల లోనికి వస్తున్నాయని, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారనీ మున్సిపల్ కమిషనర్‌కి చెప్పినా ఏలాంటి స్పందన లేకుండా పోయిదన్నారు. అలాగే రాత్రి వేళలో కొంతమంది వ్యక్తులు కళాశాల లోపలకు వెళ్లి మద్యం సేవిస్తూ అక్కడే తాగిన సీసాలను కూడా పగలగొట్టి వెళుతున్నారని కలెక్టర్ కూడా చెప్పిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. విద్యార్థులు ఉదయం కళాశాలకు వెళ్లగానే విద్యార్థుల కాళ్లకు కోసుకుంటున్నా పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. కళాశాల నిర్మాణం కూడా పూర్తిగా కాకపోవడం వల్ల విద్యార్థులకు సరిపడా గదులు లేక బయట కూర్చోబెట్టి చదువు చెప్పే పరిస్థితికి దిగజారిపోయారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి విద్యార్థుల సమస్యలపై సమీక్ష చేసి మురికి కాలువ సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే కాలంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున జిల్లా అధికారుల ఆఫీసులను ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు జగన్, జిల్లా నాయకులు భానుచందర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-వర్గల్



గజ్వేల్ స్నేహ లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో అనంతగిరి పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సయ్యద్ మతిన్, వెలుర్ కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయులు కనక రాజు, ఉప సర్పంచ్ కనక రాజు, పాఠశాల హెచ్‌ఎం గీతరాణి, క్లబ్ సభ్యులు సంజయ్ గుప్త,శ్రీనివాస్, అజమ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు సయ్యద్ మతీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్ ఇవ్వడం ఆనందంగా ఉందని, విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, అవసరం అయిన సందర్భంలో లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని తెలియజేశారు

రోడ్డు పనులను పరిశీలించిన మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-నంగునూరు



మండల కేంద్రంలో జరుగుతున్న నాలుగు వరుసల రోడ్డు పనులను మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. రోడ్డు వెడల్పు పనులకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. అంబేద్కర్ సర్కిల్ వరకు నాలుగు కోట్ల వ్యయంతో నాలుగు వరుసల రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు మంత్రి తన్నీరు హరీష్ రావును సైడ్ డ్రైనేజ్ నిర్మాణం కోసం నిధులను విడుదల చేశారన్నారు. డివైడర్‌తో కూడిన నాలుగు వరుసల రోడ్ నిర్మాణంతో పాటూ సైడ్ డ్రైనేజ్ అలాగే డివైడర్ మధ్యలో బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేయనున్నామని ఆయన తెలిపారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్.అండ్.బీ అధికారులకు, సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.అండ్.బీ డిప్యూటీ ఈఈ వెంకటేశం, జేఈ శ్రీకాంత్, నాయకులు రంగు రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో రక్త దాన శిబిరం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురికి ప్రాణదాతలుగా మారుతారని ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ బి సురేఖ అన్నారు. మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ బస్ డిపోలో టిఎస ఆర్టిసి బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. బస్ డ్రైవర్లు కండక్టర్లు, సిబ్బంది బ్లడ్ డొనేషన్ చేశారు, బ్లడ్ డొనేషన్ చేసిన వారికి హెచ్ డి ఎఫ్ సి గజ్వేల్ ప్రజ్ఞపూర్ శాఖ బ్యాంక్ మేనేజర్ సందీప్ ఆధ్వర్యంలో పండ్లు,ఫ్రూట్ జ్యూస్ అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సురేఖ మాట్లాడుతూ టిఎస్ఆర్టిసి ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో అసిస్టెంట్ మేనేజర్ కనక లక్ష్మీ, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, పాల్గొన్నారు

ఆర్టీసీ డిపోలో మెగా రక్తదాన శిబిరం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో మంగళవారం డిపో మేనేజర్ సిహెచ్ వెంకటేశ్వర్లు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆదేశాల మేరకు హుస్నాబాద్ డిపోలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రక్తదాన శిబిరం లో 53 మంది రక్తదానం చేశారన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-తొగుట

బుధవారం కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఇంచార్జ్ తహసీల్దార్ మహమ్మద్ జహిర్ తెలిపారు. మండల పరిధిలోని 15 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే రఘునందన్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి లు హాజరు కానున్నారని తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశోక్ రాజ్, తహసీల్దార్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

హనుమాన్ దేవాలయం వద్ద పులిహోర పంపిణీ



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ అంగడిపేట్ హనుమాన్ దేవాలయం వద్ద హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య నాయకులు బొజ్జ సంతోష్ కుమార్ కుటుంబ సభ్యుల సౌజన్యంతో పులిహోర పంపిణీ చేయడం జరిగింది. హనుమాన్ దేవాలయంలో బొజ్జ సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దాదాపు రెండు వందల మందికి పులిహోర పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ మాజీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి శంకరయ్య మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు. హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన నోముల మహేందర్‌కు, పులిహోర పంపిణీ దాత బొజ్జ సంతోష్ కుమార్ దంపతులకు అభినందనలు తెలిపి ప్రతి ఒక్కరూ సేవా నిరతి కలిగి ఉండాలన్నారు. దైవ నామస్మరణ తోనే మానవ జన్మ సార్థకం అవుతుందని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ హనుమాన్ కృపా కటాక్షాలు నిండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కైలాస ప్రభాకర్, దొంతుల సత్యనారాయణ, ఆదిమూలం రవి, కైలాస ప్రశాంత్, గంగిశెట్టి వెంకటేష్, ఉమేష్,ఆంజనేయులు, నాగేంద్రం,దుబకుంట లచ్చలు, శ్రీహరి,కొమర వెల్లి శేఖర్, అంజయ్య, గందే సంతోష్, హనుమాన్ భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణశీల హనుమాన్ గుడి నిర్మాణానికి విరాళాలు



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని కర్కపట్ల గ్రామంలో హనుమాన్ గుడి పునర్ నిర్మాణంలో భాగంగా కృష్ణశీల రాయితో నిర్మించే హనుమాన్ గుడి నిర్మాణానికి మంగళవారం వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండీ.జహంగీర్ రూ. 51వేలు, మర్కుక్ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, రూ. 11 వేలు,మర్కుక్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్ ,రూ.51వేలు, మర్కుక్ ఎంపీటీసీ చైతన్య శంకర్ రెడ్డి,రూ. 51 వేలు విరాళాలు గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు బాలకృష్ణ రాళ్ల బండి, ప్రవీణ్ నిరుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బింగి శ్రీశైలం యాదవ్ , నరసింహ గౌడ్, రంగనాథ్ గౌడ్, మైస కృష్ణ,శీలం ఎల్లం, గడ్డం రాజశేఖర్ రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి, సత్యం గౌడ్, నాగరాజు గౌడ్, పంజా మధు యాదవ్ తదితరులున్నారు .

5వ వార్డులో ఆరోగ్య పరీక్షలు



నవ తెలంగాణ-సిద్దిపేట

మంత్రి హరీష్ ఆదేశాలమేరకు, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు సూచనతో 5వ వార్డ్ లో పద్మశాలి సంఘంలో వార్డ్ ప్రజలకి ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు వార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ తెలిపారు. వైద్య పరీక్షలతో పాటు, అవసరమైన వారికి మందులు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం షాహిన్ సుల్తానా, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆసరాగా కోఆప్షన్



నవ తెలంగాణ-రాయపోల్

నిరుపేద కుటుంబాలకు తన వంతు సహకారం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు రాయపోల్ మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్. మంగళవారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ రంజాన్ భార్య బిపాషా గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిపాషా మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నిరుపేద కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బంధారం సంతోష్,గ్రామ కో-ఆప్షన్ సభ్యులు షాదుల్, సీనియర్ నాయకులు కర్ల కర్ణాకర్ రెడ్డి, వాజిత్, గ్రామ యూత్ అధ్యక్షులు పడిగే రవీందర్, బీఆర్ఎస్వి అధ్యక్షులు కృపాకర్, సోషల్ మీడియా అధ్యక్షులు సంగేమ్ అరుణ, యూత్ నాయకులు అరుణ,హరిష్,దండు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ యాదగిరికి మాతృవియోగం

నవతెలంగాణ-చేర్యాల

ఒక దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్న చేర్యాల మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన తాడెం యాదగిరి తల్లి నర్సమ్మ(88) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు మృత దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఓ కుమార్తె ఉన్నారు.

మూసి వేసిన నెంబర్-3 పాఠశాలను ఓపెన్ చేయాలి

నవ తెలంగాణ - సిద్దిపేట

అంబేద్కర్ నగర్‌లో మూసివేసిన నెంబర్-3 పాఠశాలను ఓపెన్ చేయాలని కోరుతూ అంబేద్కర్ నగర్ యువకులు, విద్యార్థులు మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు పుట్ల దినేష్, సీపీఎం 19వ వార్డు కార్యదర్శి కొండం సంజులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల నెంబర్-3ను వెంటనే ఓపెన్ చేయాలని, పాఠశాలలకు రావాల్సిన నిధులు దాదాపు మూడు సంవత్సరాల నుండి రాకపోవడంతో, స్కూలు అద్దెకిచ్చిన ఓనర్ స్కూల్ లాక్ వేయడం జరిగిందని అన్నారు. దాదాపు 70 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారని,



పాఠశాల మూసివేతతో విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఆ స్కూలుకు రావాల్సిన నిధులు విడుదల చేయాలని, ఆ స్కూల్‌కు సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరిన్ని పోరాటాలు చేయనికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో తుమ్మల భాను, సాయి, చిన్న, నవీన్, విక్కీ, పెర్క నవీన్, రాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు దేశానికి ఆదర్శం

వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ఇప్ప లక్ష్మి

నవతెలంగాణ-దౌల్తాబాద్

రైతుబంధు దేశానికి ఆదర్శమని దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ఇప్ప లక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. అన్నదాతలకు రైతుబంధు విడుదల చేసిన సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో ఆమె





మాట్లాడుతూ రైతుబంధు దేశానికి ఆదర్శమన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వేమ శ్రీనివాస్, సర్పంచ్ ముత్యంగారి యాదగిరి, న్యాలపల్లి లక్ష్మణ్, కేంసారం నాగరాజు, వీరుడు సత్యనారాయణ , చెన్నారెడ్డి బాల్ రెడ్డి, గుమ్మడి ఎర్ర లింగం, మనంజిగారి మల్లేశం, తుడుం లక్ష్మి కొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి, గజ్వేల్ దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ ఇన్చార్జి సెక్రెటరీ జాన్ వెస్లీ, కార్యాలయ సిబ్బంది వంశీతోపాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేబర్తి మాజీ ఉపసర్పంచి శమ్మని కిష్టయ్య మృతి

కుటుంబ సభ్యులను పరామర్శించిన జడ్పిటిసి, వైస్ ఎంపీపీ



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ శమ్మని కిష్టయ్య (70) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి ,మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ లు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

సంతాప సభ



నవ తెలంగాణ-సిద్దిపేట

అలయన్స్ సిద్దిపేట జిల్లా పూర్వ గవర్నర్ రాజమలయ్య గౌడ్ 19న అకాల మరణం సందర్భంగా జిల్లా గవర్నర్ సోమ వనజ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మ రాములు, వైకుంఠం, అంజయ్య, ఫాస్ట్ గవర్నర్లు అంతయ్య రాజేశ్వర్ రెడ్డి, జిల్లా క్యాబినెట్ సభ్యులు, అలయన్స్, లైన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై అసాంఘీక కార్యకలాపాలు

- మేడిపల్లి, ఇబ్రహీంనగర్, రాముని పట్ల గ్రామాల మధ్య రహదారి పక్కన బైఠాయిస్తున్న మహిళలు
- మహిళల వ్యవహారంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- యువతపై ప్రభావం
- వ్యభిచార కార్యకాలపాలపై అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ప్రయాణికుల విజ్ఞప్తి

నవతెలంగాణ-చిన్నకోడూరు : రాజీవ్ రహదారి అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. మండలంలోని మేడిపల్లి-ఇబ్రహీంనగర్-రామునిపట్ల గ్రామాల మధ్య నిత్యం ఉదయం నుండి సాయంత్రం వరకు పలువురు మహిళలు అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతుండటం అధికారుల అసత్వానికి దర్పణం పడుతోంది. జిల్లా కేంద్రానికి చెందిన పలువురు మహిళలు ప్రయాణీకులుగా వస్తూ మేడిపల్లి-ఇబ్రహీంనగర్-రామునిపట్ల గ్రామాల మధ్య రాజీవ్ రహదారి పక్కనే ఉన్న గుట్టను, పొదలను అసాంఘీక కార్యకలాపాలకు స్థావరంగా ఏర్పాటు చేసుకున్నారు. రాజీవ్ రహదారి పక్కన బైఠాయించి మహిళలు ద్విచక్ర వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని పలువురు వాపోతున్నారు. అధికారులు చూసీచూడనట్టు విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలు విటులను గుట్టలోపల ఆవరణలోకి తీసుకెళ్లి నిలువు దోపిడీ చేస్తున్నారని తెలిసింది. ఎలాంటి సంఘటనలు జరగకముందే సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రాజీవ్ రహదారి పక్కన నిర్వహిస్తున్న అసాంఘీక కార్యకలపాలపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎంపిపి కూర మాణిక్యరెడ్డి

నవతెలంగాణ- చిన్నకోడూరు

ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో డీపీఓ దేవకీదేవి, డీఏ శాంతి, ఎంపీపీ మాణిక్యరెడ్డి దుకాణాలు, హెూటళ్లలో అనూహ్యంగా తనిఖీలు చేశారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలు, వాటి వల్ల ప్రజల ఆరోగ్యానికి కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకుండా మట్టి వినియోగించి కాంక్రీట్‌లను తయారు చేసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాల బారిన పడకుండా ఉండవచ్చని సూచించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కొబ్బరి పీచు, ప్లాస్టిక్ వస్తువులు బయట వేయరాదని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పరిశుభ్రత మన ఇళ్లకే పరిమితం కాకుండా మన దేశానికి కూడా విస్తరించాలని వారు ఉద్ఘాటించారు. ఈ



కార్యక్రమంలో వైద్యురాలు శాంతి, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎపిటిసి శరద్ రమేష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సోమిరెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జి గుడుమళ్ల రాజలింగం, పంచాయతీ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.